బుధవారం
10-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 50
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'త్రివర్ణ జెండా' దందా
మానుకోండి

ప్రధాని, రైల్వేమంత్రికి సీపీఐ సూచన

న్యూఢిల్లీ: త్రివర్ణ పతాకాల విక్రయాల ద్వారా సొమ్ము చేసుకోవడాన్ని పాలక పక్షం ఆపేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. టోకు మార్కెట్‌లో రూ.10కి దొరికే జెండాను సామాజిక, ప్రభుత్వ రంగ సంస్థల్లో రూ. 20కు, ప్రభుత్వ పోస్టాఫీసుల్లో రూ. 25 చొప్పున అమ్ముతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ వ్యాఖ్యానించారు. ఈ వాస్తవాల దృష్ట్యా జాతీయ జెండా నీడలో జరుగుతున్న కుంభకోణంపై దృష్టి పెట్టాలని ప్రధానికి, రైల్వే మంత్రికి సూచించారు. త్రివర్ణ పతకాల దందా హేయమైన నేరమన్నారు. ఓ వైపు స్థానిక వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వాలని, దేశీయ ఉత్పత్తులను వినియోగించాలని ప్రధాని పిలుపునిస్తున్నారు మరోవైపు కోట్లలో త్రివర్ణపతాకాలు విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయని అన్నారు. ఈ పంద్రాగస్టున దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతాయి. ఇదే రోజు ప్రతి ఇల్లు, దుకాణం, విద్యా సంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఆఫీసులపై మువ్వన్నెల జెండా రెపరెపలాడటం ఆనవాయితీ. తమ శాఖ నుంచి త్రివర్ణ జెండాలను కొనుగోలు చేయాలని పదిన్నర లక్షల మంది ఉద్యోగులకు భారతీయ రైల్వే ఇటీవల హుకుం జారీ చేసింది. ఇందుకోసం వారి వేతనాల్లో నుంచి రూ.38 మినహాయిస్తుంది. అన్ని జెండాలను సరఫరా చేసేది ఒకరే కావడం గమనార్హమని ఆ ప్రకటనలో అంజన్ పేర్కొన్నారు.

'కామన్వెల్త్' విజేతలకు సీపీఐ అభినందనలు

కామన్వెల్త్ క్రీడలలో భారతీయ క్రీడాకారుల ప్రతిభ ప్రశంసనీయమని సీపీఐ పేర్కొంది. 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్య పతకాలను భారతీయ క్రీడాకారులు సాధించడానికి వారి గట్టి పట్టుదల, కృషితో పాటు కోచ్‌ల మార్గదర్శకత్వమే కారణం అని అతుల్ కుమార్ అంజన్ అన్నారు. వారిని చూసి దేశం గర్విస్తోందన్నారు. కోచ్‌లతో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) దశాబ్దం పాటు తోడ్పాటు అందించిందని కొనియాడారు. యువ క్రీడాకారులకు ప్రోత్సాహం, తగిన శిక్షణ అందించడంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఈ విజయ పరంపరను ప్రతి కామన్వెల్త్ క్రీడల్లో భారతీయ క్రీడాకారులు కొనసాగిస్తారని, ఒలింపిక్స్‌లోనూ వీరు మరింతగా రాణిస్తారని, మరిన్ని పతకాలు సాధిస్తారని అతుల్ కుమార్ ఆకాంక్షించారు.

కృష్ణా పరవళ్లు

పెరుగుతున్న వరద ఉధృతి

- శ్రీశైలం ప్రాజెక్టు వద్ద ఎనిమిది గేట్లు ఎత్తివేత
- ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి నీటి విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కృష్ణా నది పరవళ్లు తొక్కుతోంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఎగువ రాష్ట్రాల్లో కూడా నదీ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం 8 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేశుల ప్రాజెక్టులు నిండుకోవడంతో సుమారు లక్షా 80వేల క్యూసెక్కుల నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నిండుకుండలా ఉంది. దీంతో ఎగువ నుంచి

- మిగతా 2 లో

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల
ఐక్యత అవశ్యం

- అక్టోబరు 14 నుంచి 18 వరకు సీపీఐ జాతీయ మహాసభలు
- చారిత్రక ఆతిథ్యానికి విజయవాడ శ్రీకారం
- ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని మోదీకి తాకట్టు పెట్టొద్దు: రామకృష్ణ
- మహాసభల వాల్‌పోస్టరు, కరపత్రాలు ఆవిష్కరించిన ఆహ్వానసంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయోద్యమ కాలం నుంచి కమ్యూనిస్టు ఉద్యమాలు, ప్రజా పోరాటాలకు వేదికగా, రాజకీయ రాజధానిగా నిలిచిన విజయవాడ నగరం సీపీఐ 24వ జాతీయ మహాసభలకు ఆతిథ్యం ఇస్తుందని మహాసభల ఆహ్వానసంఘం ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. విజయవాడ ఎస్ఎస్ కల్యాణ మండపం వేదికగా అక్టోబరు 14 నుంచి 18వరకు జరగనున్న సీపీఐ జాతీయ మహాసభల వాల్ పోస్టరు, కరపత్రాలను విజయవాడ దాసరిభవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ, మహాసభల కోశాధికారి జల్లి విల్సన్, ఆహ్వానసంఘం ఉపాధ్యక్షుడు(సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు) జి.ఓబులేసు, ఆహ్వానసంఘం కార్యదర్శి(సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు) అక్కినేని వనజ, ఆహ్వాన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి(సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు) దోనేపూడి శంకర్, ఉపాధ్యక్షులు (పార్టీ రాష్ట్ర

- మిగతా 2 లో

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, జల్లి విల్సన్, ఓబులేసు, వనజ తదితరులు

బ్యాంకుల ప్రైవేటీకరణకు
ప్రతిఘటన

- మోదీ కార్పొరేట్ విధానాలతో చేటు
- జాతీయ బ్యాంకులతోనే గ్రామీణాభివృద్ధి
- ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన బ్యాంకుల ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రతిఘటించాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకటాచలం పిలుపునిచ్చారు.

3లో

నితీశ్ రాజీనామా

- మహాకూటమి నేతగా ఎన్నిక
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నరుకు విజ్ఞప్తి
- కొత్త ప్రభుత్వానికి ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్షాల మద్దతు
- ఎన్‌డీఏకి జేడీయూ గుడ్‌బై
- శరవేగంగా మారిన బీహార్ పరిణామాలు

పాట్నా: బీహార్‌లో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. ఎన్‌డీఏ నుంచి జేడీయూ బయటికి వచ్చింది. ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి మహాకూటమి ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బీహార్‌లో బీజేపీ కుట్రలను నితీశ్‌కుమార్ ఒక్కొక్కటీ బహిర్గతం చేశారు. మహాకూటమి ప్రభుత్వం ఏర్పాటుకు

- మిగతా 2 లో

హర్షణీయం: సీపీఐ 2 లో

ప్రశ్నించే హక్కు హరణ

- 10 మందిపై జీఐసీ నిషేధం
- వారిలో ఒకరికి రూ.5 వేల జరిమానా
- ఇది చరిత్రలోనే తొలిసారి
- అధికారులను వేధించేందుకే ఆర్టీఐ అర్జీలు: సీఐసీ ఆరోపణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ అధికారులను వేధిస్తున్నారన్న నెపంతో పౌరులకున్న ప్రశ్నించే హక్కులను హరించే విధంగా గుజరాత్ సమాచార కమిషన్ (జీఐసీ) వ్యవహరించింది. సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం కింద వరుసపెట్టి 18 నెలలుగా అర్జీలు పెడుతున్నారన్న ఆరోపణలతో పది మందిపై నిషేధం విధించింది. మరోమారు ప్రశ్నించే వీలు లేకుండా చేసింది. చరిత్రలో తొలిసారిగా ఓ ఫిర్యాదికి రూ. 5,000 జరిమానా విధించింది. అయితే ఇలాంటి అక్రమ

- మిగతా 2 లో

స్వేచ్ఛను కాపాడుకోవాలి 2 లో

మహిళలకు మొండిచేయి

- హక్కుల కార్యకర్తలు, రాజకీయ వర్గాల నుంచి విమర్శలు
- మహారాష్ట్ర మంత్రులుగా 18మంది ప్రమాణం



ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఎట్టకేలకు తన కేబినెట్‌ను విస్తరించారు. 18 మందికి మంత్రివర్గంలో చోటు కల్పించారు. బీజేపీ, శివసేన షిండే వర్గం నుంచి తొమ్మిది మంది చొప్పున మంత్రు లుగా అవకాశం దక్కించుకున్నారు. మంగళవారం ఉదయం రాజ్ భవన్‌లో గవర్నర్ భగత్ సింగ్ కోష్యారీ 18 మంది ఎమ్మెల్యేలతో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ట్రంప్ నివాసంలో ఎఫ్‌బీఐ సోదాలు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మార్-ఎ-లాగో ఎస్టేట్‌లో ఎఫ్‌బిఐ (అమెరికా దర్యాప్తు సంస్థ) సిబ్బంది సోదాలు చేపట్టింది. మంగళవారం తెల్లవారుజామున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలాసవంతమైన ఫామ్ హౌస్, రిసార్ట్ మార్-ఎ-లిగోను దర్యాప్తు ఏజెన్సీ ఏజెంట్లు చుట్టుముట్టగా.. ఎఫ్‌బిఐ తనిఖీలు చేపట్టింది. ఈ సోదాలకు సంబంధించి ఎఫ్‌బిఐ ఇంతవరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ట్రంప్ దేశ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో దేశ రహస్యపత్రాలను ఇక్కడకు తరలించారన్న అనుమానంతో ఈ సోదాలు చేపట్టినట్లు సమాచారం. దీనిని అధికారులు ధృవీకరించలేదు. అమెరికఅ అధ్యక్షుడి ఇల్లు సీక్రెట్ సర్వీస్ సిబ్బంది రక్షణలో ఉంటుంది.తనిఖీలకు కొద్ది సేపటి ముందు ఎఫ్‌బీఐ సిబ్బంది సీక్రెట్‌సర్వీస్‌కు వారెంట్ విషయం వెల్లడించారు. ఒక్కసారిగా 30 మంది సిబ్బంది మార్ ఎ లాగోకు వచ్చారు. వీరు ఎఫ్‌బీఐ ఆఫీసు నుంచి రాకుండా శ్వేతసౌధం నుంచి వచ్చినట్లు ట్రంప్ కుమారుడు ట్రంప్ కుమారుడు ఎరిక్ ఓ వార్తా సంస్థకు వెల్లడించారు.

దీనిపై ట్రంప్ స్పందిస్తూ... ఇది దేశానికి చీకటి దినంగా పరిగణించారు. మార్-ఎ-లెగోలోని పామ్ బీచ్‌లోని తన అందమైన నివాసాన్ని ఎఫ్‌బిఐ స్వాధీనం చేసుకుందని అన్నారు. దీనికి కారణం చెప్పలేదు. అయితే, ఎఫ్‌బిఐ దాడుల సమయంలో డొనాల్డ్ ట్రంప్ తన నివాసంలో లేరని, ప్రస్తుతం ఆయన న్యూజెర్సీలో ఉన్నట్లు తెలుస్తోంది. సంబంధిత ప్రభుత్వ ఏజెన్సీలతో పని చేసి, సహకరించిన తర్వాత కూడా తన ఇంటిపై ఈ అనూహ్య దాడి తగినది కాదు అని ట్రంప్ తన ప్రకటనలో తెలిపారు. ఎఫ్‌బిఐ చర్య రాజకీయ ప్రతీకారమేనన్నారు. మాజీ అధ్యక్షుడి ఇంటిపై దర్యాప్తు సంస్థ దాడి చేయడం అమెరికాకు గడ్డు కాలమని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో ఇంతకు ముందు ఏ మాజీ అధ్యక్షుడికి ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదని చెప్పారు. దర్యాప్తు సంస్థకు సహకారం అందిస్తున్నప్పటికీ.. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన నివాసంపై ఆకస్మిక దాడి చేశారని ట్రంప్ ఆరోపించారు. 2024 ఎన్నికల్లో తనను పోటీ చేయనీయకుండా ఆపాలని కోరుకునే డెమొక్రాట్ల దాడిగా ట్రంప్ ధ్వజమెత్తారు.

ఇరాన్ అణు ఒప్పందంపై చర్చల పునరుద్ధరణ

వియన్నా: ఇరాన్ అణు చర్చలలో ముందస్తు ఒప్పందం అమలుకు తక్షణ నిర్ణయం తీసుకోవాలని ఐరాసలో చైనా శాశ్వత ప్రతినిధి వాంగ్ అమెరికాను కోరారు. ఐదు నెలల విరామం తర్వాత గత వారం ఆస్ట్రియా రాజధాని వియన్నాలో తిరిగి ప్రారంభమైన చర్చల సందర్భంగా వాంగ్ పై వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా పిలువబడే 2015 ఇరాన్ అణు ఒప్పందాన్ని పునరుద్ధరించే లక్ష్యంగా ఈ చర్చలు జరిగాయి. ఇరాన్ అణు సమస్యను పరిష్కరించడానికి చర్చలు, చర్చల ద్వారా విభేదాలను తగ్గించడం ఒక్కటే మార్గమని వాంగ్ పేర్కొన్నారు. అన్ని దేశాలు ప్రస్తుత అవకాశాలను ఉపయోగించుకోవాలని, ఆచరణాత్మక, సౌకర్యవంతమైన విధానాలను అవలంబించాలని, ఒకరి ఆందోళనలు, ప్రయోజనాలను మరొకరు గౌరవించుకోవాలని, దానికి అనుకూల వాతావరణాన్ని సృష్టించాలని, ప్యాకేజీ పరిష్కారంతో అసాధారణ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా వివిధ చర్యలు చేపట్టిందని చైనా సహా అనేక దేశాలపై కొత్త ఆంక్షలు విధించిందని చైనా రాయబారి పేర్కొన్నారు.

'ఇరాన్ అణు సంక్షోభానికి మూలకర్తగా అమెరికా ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవాలి, చిత్తశుద్ధి చూపాలి, రాజకీయాకరణను విడిచిపెట్టాలి, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక సమస్యలపై ద్వంద్వ ప్రమాణాలను వర్తింపజేయడం మానుకోవాలని ముందస్తు ఒప్పందాన్ని ప్రోత్సహించడానికి తక్షణమే రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలని వాంగ్ విజ్ఞప్తి చేశారు. "చైనా ప్రయోజనాలను దెబ్బతీసే ఏ ప్రయత్నమూ ఆమోదయోగ్యం కాదని వాంగ్ పేర్కొన్నారు. చైనా నిర్మాణాత్మకంగా పాల్గొనడం బహుపాక్షికత పట్ల దాని నిబద్ధతను తెలియజేస్తోందని, అటువంటి చర్చలను ప్రోత్సహించడంలో చైనా చేస్తున్న ప్రయత్నాలు కొత్త తరహా అంతర్జాతీయ సంబంధాలను, మానవాళికి భాగస్వామ్య భవిష్యత్తుతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి దాని ప్రయత్నాలను హైలైట్ చేస్తున్నాయని ఆయన అన్నారు.

స్వేచ్ఛను కాపాడుకోవాలి: సోనియా

న్యూదిల్లీ: క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం పురస్కరించుకొని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ మంగళవారం దేశ స్వాతంత్ర్యాన్ని 'మన శక్తితో' రక్షించాలని ప్రజలకు ఉద్బోధించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆ సమయంలో బ్రిటిష్ వారికి మద్దతు ఇచ్చిందని ఆరోపిస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్త లను కొట్టి జైల్లో పెట్టిన ఈ చారిత్రాత్మక రోజున అరుణా ఆసిఫ్ అలీ జాతీయ జెండాను ఎగుర వేశారు. ఆమె ధైర్యసాహసాలు మన స్వాతంత్ర్య తపనకు ప్రతీక అని సోనియా గాంధీ తన సందేశంలో అన్నారు. 'మహాత్మా గాంధీ నేతృత్వంలోని క్విట్ ఇండియా ఉద్యమాన్ని మనం స్మరించుకుంటున్నప్పుడు, భారతదేశ స్వాతంత్ర్యం కోసం లక్షలాది మంది మన దేశస్తులు, మహిళలు చెల్లించిన మూల్యాన్ని మనం మరచిపోకూడదు. మన శక్తితో దానిని రక్షించడానికి మన సంకల్పాన్ని పునరుద్ధరించుకుందాం' అని ఆమె తెలిపారు. 'కాంగ్రెస్ నాయకత్వంలో దేశం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక పోరాటంలో నిమగ్నమై ఉన్నప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఉద్యమాన్ని బహిష్కరించడమే కాకుండా బ్రిటీష్ వారికి చురుకుగా మద్దతు ఇచ్చింది' అని కాంగ్రెస్ తన అధికారిక ట్విట్టర్ హ్యాండిల్‌లో హిందీలో పేర్కొంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను విమర్శిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్... 80 ఏళ్ల క్రితం మహాత్ముడు క్విట్ ఇండియాను ప్రారంభించిన ఈ చారిత్రాత్మక రోజున సంస్థ ఏమి చేస్తోందని ప్రశ్నించారు. 'ఇది ప్రజల ఉద్యమం నుంచి విడదీసి పక్కదారి పట్టింది. గాంధీ, నెహ్రూ, పటేల్, ఆజాద్, ప్రసాద్, పంత్, అనేక మంది జైలు పాలైనప్పుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ పాల్గొనలేదు' అని ఆయన ఒక ట్వీట్‌లో తెలిపారు.

శాంతి, సుస్థిరతకు కట్టుబడి ఉండాలి: చైనా

నమ్‌పెన్: శాంతిని పెంపొందించేందుకు ఆసియా-పసిఫిక్ దేశాలు కట్టుబడి ఉండాలని చైనా విదేశాంగ మంత్రి పిలుపునిచ్చారు. ఆసియా-పసిఫిక్ దేశాలమధ్య సహకారాన్ని బలోపేతం చేయాలని, ఈ ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వం, అభివృద్ధిని సంయుక్తంగా కాపాడాలని వాంగ్ యి పేర్కొన్నారు. కంబోడియా రాజధాని నమ్‌పెన్‌లో జరిగిన 29వ ఆసియా దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

కరోనా మహమ్మారి,ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వం, పునరుజ్జీవనం వంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కొన్న వాంగ్, ఐక్యరాజ్యసమితి చార్టర్ అంతర్జాతీయ చట్టాన్ని సభ్య దేశాలు పాటించాలని, ఆయా దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా ఉమ్మడి భద్రతను ప్రోత్సహించాలని సమావేశంలో వాంగ్ ప్రతిపాదించారు. అంతర్జాతీయ చట్టం ఆధారంగా అంతర్జాతీయ క్రమానికి కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. సభ్య దేశాలు అంతర్జాతీయ వస్తువులను విస్తృతం చేయాలని వారి స్వంత ప్రయోజనాలు, అభివృద్ధి కోసం ఇతర దేశాల విజ్ఞప్తిని గౌరవించాలని తెలిపారు. దేశాలు తమ స్వంత అభివృద్ధి కోసం ఉమ్మడి పురోగతిని ప్రోత్సహించాలని అన్నారు. కొన్ని దేశాలు ఏకపక్షవాదం కోసం ప్రయత్నించడాన్ని చైనా వ్యతిరేకిస్తుందన్నారు. చట్టవిరుద్ధమైన ఆంక్షలు, అణచివేత చర్యలను సహించేదిలేదని వాంగ్ స్పష్టం చేశారు. ఇతర దేశాల సహేతుకమైన భద్రతా ఆందోళనలకు ప్రాముఖ్యత ఇవ్వాలని, గౌరవించాలని, ఈ ప్రాంతంలో శాంతి,స్థిరత్వాన్ని సంయుక్తంగా సమర్థించాలని, నిజమైన భద్రతను సాధించాలని ఆయన దేశాలను కోరారు.

ప్రశ్నించే హక్కు హరణ

(మొదటిపేజీ తరువాయి)

చర్యలను గుజరాత్ హైకోర్టులో సవాల్ చేయాలని సమాచార కమిషన్ మాజీ చీఫ్ వజాహత్ హబీబుల్లా తెలిపారు. ఈ పది కేసులను ఆర్టీఐ హెల్ప్‌లైన్, అర్జీలు, స్పందనలపై అధ్యయనాలు నిర్వహించే ఎన్జీవో 'గుజరాత్ పెహల్'కు చెందిన మహితీ అధికార్ సమీక్షించారు. ప్రస్తుత సమస్యలపై సమాచారం ఇవ్వొద్దు అని సంబంధిత అధికారులకు కమిషన్ ఆదేశాలిచ్చినట్లు ఓ ప్రముఖ వార్తా సంస్థ పేర్కొంది. సర్వీసు బుక్ ప్రతితో పాటు వేతనాల వివరాలను కోరిన గాంధీనగర్, పేథాపూర్‌లోని స్కూలు టీచరు అమితా మిశ్రా ఫిర్యాదులను మరెప్పుడూ స్వీకరించవద్దు అని విద్యాశాఖ జిల్లా కార్యాలయానికి, సర్వ విద్యాలయ కడికి సమాచార కమిషనర్ కేఎం అధ్వర్యు ఆదేశాలిచ్చినట్లు వార్తా నివేదిక తెలిపింది. అవే ప్రశ్నలు మళ్లీ మళ్లీ అడుగుతుంటారని, ఆర్టీఐ రుసుముగా పేజికి రూ.2 కూడా చెల్లించరని ఆమెపై స్కూలు యంత్రాంగాలు ఫిర్యాదు చేశాయి. రెసిడెన్షియల్ సొసైటీకి సంబంధించి 13సార్లు ఆర్టీఐ ద్వారా ప్రశ్నించినందుకు పెట్లాడ్ పట్టణానికి చెందిన హితేశ్ పటేల్ దంపతులకు రూ.5వేల జరిమానా విధించారు. ఇలా మునుపెన్నడూ జరగలేదు. తన వ్యవస్థ గురించి ప్రశ్నలు వేసినందుకు మొదాసా పట్టణంలోని కస్బా స్కూలు ఉద్యోగి సత్తార్ మజిద్ ఖలీఫాపై ఆర్టీఐ అర్జీలు పెట్టకుండా నిషేధం విధించారు. ఆయన నుంచి ప్రశ్నించే హక్కును హరించివేశారు. ఆర్టీఐ దరఖాస్తుల ద్వారా స్కూలుపై ప్రతీకారం తీర్చుకోవాలని ప్రయత్నించినట్లు ఆరోపించారు. ప్రజా సమాచార అధికారితో పాటు కమిషన్‌పైనా వర్చువల్ విచారణప్పుడు ఖలీఫా ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీఐ అర్జీలు అపరిష్కృతంగా ఉండటం సాధారణమైపోయింది. 2017 అక్టోబరులో కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) వద్ద 35వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదు. జులై 18కి మొత్తం 26,518 అప్పీళ్లు, ఫిర్యాదులు ఆర్టీఐ చట్టం కింద దాఖలు కాగా వీటికీ సీఐసీ క్లియరెన్స్ లభించలేదు. సమాచారాన్ని ఇవ్వరాదని అధికారులు భావించడమే ప్రాథమిక కారణమని ఆర్టీఐ కార్యకర్తలు పేర్కొన్నారు. సీఐసీ అధికారుల వాదన ఇందుకు భిన్నంగా ఉంది. పనికిమాలిన ఫిర్యాదులు వస్తున్నందునే పెండింగ్ కేసులు పెరుగుతున్నట్లు వెల్లడించారు.

మహిళలకు మొండిచేయి

(మొదటిపేజీ తరువాయి)

కావాల్సి ఉండగా.. 15 నిమిషాలు ఆలస్యంగా మొదలైంది. అయితే ప్రస్తుత కేబినెట్‌లో ఒక్క మహిళ కూడా లేకపోవడం గమనార్హం. మంత్రివర్గంలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడాన్ని రాజకీయవర్గాలు, మహిళా హక్కుల కార్యకర్తలు తప్పుబడుతున్నారు. 'దేశంలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన తొలి రాష్ట్రం మహారాష్ట్ర... ఇప్పుడు వారికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది...దేశ జనాభాలో 50శాతం మంది ఉన్న మహిళల పట్ల బీజేపీ ఆలోచనా ధోరణిని ఇది తెలియజేస్తోంది' అని ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలె విమర్శించారు. భూమాత బ్రిగేడ్‌కు చెందిన కార్యకర్త తృప్తి దేశాయ్ మాట్లాడుతూ...షిండే కేబినెట్‌లో ఒక్క మహిళకు సైతం స్థానం కల్పించకపోవడం నిరాశపరిచిందన్నారు. మహారాష్ట్ర వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో మహిళలకు ఇది అవమానకరమని ఆమె విమర్శించారు. సామాజిక కార్యకర్త కిరణ్ మోఘె మాట్లాడుతూ... ప్రత్యేకించి దేశం 75వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న వేళ మహిళా ప్రజాప్రతినిధులను మంత్రివర్గంలోకి తీసుకోకపోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అయితే త్వరలోనే మంత్రివర్గంలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పూనెలో విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక ఎమ్మెల్సీ, 11మంది మహిళా శాసనసభ్యులున్నారు. షిండే వర్గంలో మరో ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలుండగా, మరో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే మద్దతునిస్తున్నారు. మొత్తంగా మహారాష్ట్రలో 28మంది మహిళా శాసనసభ్యులు ఉన్నారు. తాజా విస్తరణతో సీఎం షిండే, డెప్యూటీ సీఎం ఫడ్నవీస్‌లతో సహా మహారాష్ట్ర మంత్రివర్గ సంఖ్య 20కి చేరింది.

కొత్త మంత్రులు వీరే...

మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినవారిలో బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రకాంత్ పాటిల్, సుధీర్ ముంగటివార్, గిరీష్ మహాజన్, సురేశ్ ఖాడె, రాధాకృష్ణ విఖె పాటిల్, రవీంద్ర చవాన్, మంగల్ ప్రభాత్ లోధా, విజయ్ కుమార్ గవిత్, అతుల్ సావె, శివసేన షిండే వర్గం నుంచి దాదా భూసే, శంభురాజే దేశాయ్, సందీపన్ భుమ్రే, ఉదయ్ సామంత్, తానాజీ సావంత్, అబ్దుల్ సత్తార్, దీపక్ కేసర్కర్, గులాబ్‌రావ్ పాటిల్, సంజయ్ రాథోడ్ ఉన్నారు.

రాథోడ్ ఎంపికపై బీజేపీ గుర్రు

ఉద్ధవ్ వర్గానికి చెందిన ఎమ్మెల్యే సంజయ్ రాథోడ్‌కు మంత్రివర్గంలో అవకాశం కల్పించడంపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా ఉండగా, ఆయన అటవీ శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయన కారణమని బీజేపీ నాయకులు ఆరో పించడంతో రాజీనామా చేయవలసి వచ్చింది. రాథోడ్‌ను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడంపై రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు చిత్రా వాఘ్ నిరసన వ్యక్తం చేశారు. 'మహిళ మృతికి కారణమైన మాజీ మంత్రి సంజయ్ రాథోడ్‌కు మళ్లీ మంత్రి పదవి ఇవ్వడం చాలా దురదృష్టకరం. రాథోడ్‌కు మళ్లీ మంత్రి పదవి వచ్చినా ఆయనపై నా పోరాటం కొనసాగిస్తాను' అని ఆమె అన్నారు.

చినుకుపడితేనే భృతి!

విశాలాంధ్ర - అరకులోయ: గొడుగు కార్మికుల బతుకులు దిశా నిర్దేశం లేక అగమ్యగోచరంగా తయారవుతున్నాయి. తాతలతరం నుంచి వారసత్వంగా వచ్చిన గొడుగు మరమ్మత్తుల వృత్తినే ఆధారంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న గొడుగు కార్మికుల సంక్షేమాన్ని ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం వర్షాకాలంలో మాత్రమే... అది కూడా చినుకు పడిన రోజులలోనే వారికి కాస్తో కోస్తో జీవన భృతి లభిస్తుంది. మిగిలిన రోజులు పస్తులు ఉండక తప్పని దుస్థితి నెలకొంటుంది. నాలుగు నెలల పాటు వర్షాకాలంలో ఊరూరా వీధులు, వాడలు తిరుగుతూ గొడుగు మరమ్మత్తులు చేపడుతూ వచ్చిన కాస్త డబ్బుతో పిల్లాపాపల కడుపునింపుతూ కాలం వెళ్లదీస్తున్నారు. సంవత్సరంలో నాలుగు నెలలు తప్ప మిగిలిన 8 నెలలు అష్టకష్టాలు పడుతున్నారు. పనులు దొరక్క ఇతర పనులు చేతకాక ఇంటి వద్దనే ఉంటూ అర్థాకలితో అలమటిస్తున్నారు.

నేట కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో వర్షం వచ్చినా గొడుగుతో పెద్ద అవసరం లేకుండా పోతోంది. భారీ వర్షంలో ఎలాగూ బయటకి రారుగనుక గొడుగు కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి లభించడం లేదు. దీనికితోడు ఇంట్లో మూలకు చేరిన పాతగొడుగులున్నా ... కొత్త గొడుగులే కొంటున్నారు తప్ప పాత గొడుగులను మరమ్మత్తు చేయించుకోవాలన్నా ఆలోచన రాకపోవడంతో గొడుగు కార్మికులకు వర్షాకాలంలో సైతం సరైన ఉపాధి లేకుండా పోతోంది.దీంతో జీవనోపాధి కోసం ఎదురు చూడక తప్పడం లేదు. ప్రభుత్వాలు ఏనాడు గొడుగు కార్మికుల కష్టాలను పట్టించుకున్న దాఖలాలు లేవని చెప్ప వచ్చు. వాహన మిత్ర, నాయి బ్రాహ్మణ, రజక ఇలా కుల వృత్తుల వారికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తున్నప్పటికీ గొడుగు కార్మికులను ఎందుకు విస్మరిస్తుందని అనేకమంది ప్రశ్నిస్తున్నారు.

ఒకపక్క ప్రభుత్వ ప్రోత్సాహం లేక మరోపక్క ఆర్థిక ఇబ్బందులతో పిల్లల్ని చదివించుకోలేక అగచాట్లు పడుతున్నామని గొడుగు కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. తాతలకాలం నుంచి వచ్చిన వృత్తిని వదులుకోలేక ఇతర పనులు చేసే అలవాటు, ఓపిక లేక కేవలం గొడుగు మరమ్మత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నామని తమ వంటి కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతున్నాయి. తమను ఎవరూ పట్టించుకోవడంలేదని, నిరాధారణకు గురవుతున్నామని కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కేవలం ఓట్ల కోసం కాకుండా గొడుగు కార్మికుల కష్టాలను గుర్తించి వారికి ఉపాధి కల్పించి తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజాసంఘాల నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కృష్ణా పరవళ్లు

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్న వరద మొత్తం దిగువకు వదులుతున్నారు. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 214.36 టీఎంసీల నీరు ఉంది. స్పిల్ వే ద్వారా సాగర్‌కు 1,73,695 క్యూసెక్కుల నీటిని 6 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 63,046 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఈ వరద మొత్తం నాగార్జున సాగర్ జలశయానికి చేరుతోంది. ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టుకు 2లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, దిగువకు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 27వేల క్యూసెక్కులు వదులుతున్నారు. సాగర్ జలాశయం నీటి సామర్థ్యం మొత్తం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 247.04 టీఎంసీల నిల్వ ఉంది. ఇక సాగర్ దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 40.49 టీఎంసీల నిల్వ ఉంది. పులిచింతలకు 40 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 51వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీనికితోడు పులిచింతల దిగువ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లి దాదాపు లక్షా 20వేల క్యూసెక్కుల వరద ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. దీంతో బ్యారేజీకున్న మొత్తం 70 గేట్లు 2 అడుగుల మేర ఎత్తి ఎగువ నుంచి వరద మొత్తాన్ని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఇక వాయువ్య బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశాను అనుకొని తీవ్ర అల్పపీడనం కొనసాగుతుండగా, ఇది మరింతగా బలపడి వాయుగుండంగా మారుతుందని విశాఖ వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి, భూమి మీదకు ప్రవేశిస్తుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ ప్రభావం వల్ల రాబోయే 24 గంటల్లో ఉత్తర కోస్తా జిల్లాల్లో అనేకచోట్ల వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మిగతా కోస్తా జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు పడతాయని తెలిపింది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌పై ఇది కేంద్రీకృతమయ్యే అవకాశం ఉందని, తెలంగాణ జిల్లాల్లో రేపు, ఎల్లుండి వర్షాలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. దీనివల్ల గోదావరి వరద ప్రభావం కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఒకపక్క వర్షాలు, మరోపక్క కృష్ణా, గోదావరి నదులకు వరద ఉధృతి పెరుగుతుండడంతో తీర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

నితీశ్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానించాల్సిందిగా గవర్నరు ఫాగు చౌహాన్‌కు నితీశ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. తమకు కావాల్సిన సంఖ్యాబలం ఉందని గవర్నరుకు స్పష్టం చేశారు. మరోవైపు, నితీశ్‌కుమార్ నిర్ణయాన్ని ఆర్‌జేడీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ (లిబరేషన్) స్వాగతించాయి. నితీశ్ నేతృత్వంలో మహాకూటమి ప్రభుత్వం ఏర్పాటుకు అంగీకారం తెలిపాయి. మరోవైపు, నితీశ్‌పై బీజేపీ మండిపడింది. బీజేపీకి, రాష్ట్ర ప్రజలకు నితీశ్ నమ్మకద్రోహం చేశారని ఆరోపించింది. మంగళవారం ఒక్క రోజే గవర్నరు ఫాగు చౌహాన్‌ను నితీశ్ రెండుసార్లు కలిశారు. ఎన్‌డీఏ ముఖ్యమంత్రిగా తాను రాజీనామా చేస్తున్నట్లు గవర్నరుకు లేఖ అందజేశారు. ఆర్‌జేడీ నేతృత్వంలోని మహాకూటమి నేతగా ఎన్నికైన తర్వాత మళ్లీ గవర్నరును కలిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటునకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. 164 మంది ఎమ్మెల్యేల మద్దతు లేఖను గవర్నరుకు నితీశ్ అందజేశారు. ప్రమాణ స్వీకారానికి పిలవడంపై గవర్నరు నిర్ణయం తీసుకుంటారని నితీశ్‌కుమార్ చెప్పారు. 2017లో మహాకూటమి నుంచి ఎన్‌డీఏలో చేరేందుకు ఎంత వేగంగా అడుగులు పడ్డాయో...అంతకన్నా మరింత వేగంతో నితీశ్ అడుగులు వేశారు. 9 ఏళ్ల కాలంలో నితీశ్‌కుమార్ బీజేపీతో తెగతెంపులు చేసుకోవడం ఇది రెండోసారి. ముందుగా గవర్నరు చౌహాన్‌తో సమావేశమైనప్పుడు..ఎన్‌డీఏ నుంచి బయటికి రావాలని తమ పార్టీ జేడీయూ నిర్ణయం తీసుకుందని నితీశ్ తెలిపారు. గవర్నరుతో సమావేశం అనంతరం ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్‌తో కలిసి నితీశ్‌కుమార్ నేరుగా మాజీ సీఎం రబ్రీదేవి నివాసానికి వెళ్లారు. మహాకూటమి పక్ష నేతగా నితీశ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఆ తర్వాత గవర్నరును కలిసి ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటికి చేరుకున్న నితీశ్‌కుమార్..అక్కడ పెద్దసంఖ్యలో గుమికూడిన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌డీఏ నుంచి బయటికి రావాలని పార్టీ సమావేశం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అందువల్ల ఎన్‌డీఏ ముఖ్యమంత్రిగా తాను రాజీనామా చేశానన్నారు. కాగా నేడో, రేపో నితీశ్‌కుమార్ దిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో సమావేశం కానున్నారు. నరేంద్రమోదీని ఎన్‌డీఏ ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంతో 2013లో ఆ కూటమికి నితీశ్ దూరమయ్యారు.

అంతకుముందు ఉదయం జేడీయూ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నితీశ్‌కుమార్ సమావేశమయ్యారు. బీజేపీతో తెగతెంపులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్‌డీఏ నుంచి బయటికి రావడానికి గల కారణాలు వివరించారు. అందుకు అందరి మద్దతు తీసుకున్నారు. దీనిపై జేడీయూ నేత ఉపేంద్ర కుశ్వాహ్ ట్వీట్ చేస్తూ కొత్త రూపంలో నూతన సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించనున్న నితీశ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఆర్‌జేడీతో కలిసి మహాకూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రబ్రీదేవి నివాసంలో ఆర్‌జేడీ నేతృత్వంలోని మహాకూటమి సమావేశమైంది. ఆర్‌జేడీ, జేడీయూ, వామపక్షాలు, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. బీహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రస్తుతం ఉన్న సంఖ్యాబలం ఆధారంగా 121 మంది సభ్యుల అవసరం ఉంది. మహాకూటమికి దాదాపు 160 మంది సభ్యుల బలం ఉంది. అసెంబ్లీలో పార్టీ బలాబలాలను పరిశీలిస్తే..ఆర్‌జేడీకి అత్యధికంగా 79 మంది ఎమ్మెల్యేలు, బీజేపీకి 77, జేడీయూకి 44, కాంగ్రెస్‌కు 19, సీపీఐ ఎంఎల్(ఎల్)కు 12, సీపీఐ, సీపీఎంలకు చెరో రెండు, జితన్ రామ్ మాంజీ పార్టీకి నలుగురు, ఒక ఇండిపెండెంట్ ఉన్నారు. అసదుద్దీన్ నేతృత్వంలోని ఎంఐఎంకు ఒక సభ్యుడు ఉన్నారు.

హర్షణీయం: సీపీఐ

న్యూదిల్లీ: బీజేపీతో జేడీయూ తెగతెంపులు చేసుకోవడాన్ని సీపీఐ స్వాగతించింది. జేడీయూ నాయకుడు, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ బీజేపీని విడనాడటాన్ని ఆహ్వానిస్తున్నామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నితీశ్‌కుమార్ గవర్నరు కలిసి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారని, ఇది శుభ పరిణామమని వ్యాఖ్యానించారు. హిందీ ప్రాంత రాజకీయాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని రాజా అభిప్రాయపడ్డారు. బీజేపీ యేతర రాజకీయ పార్టీల పునరేకీకరణకు ఇది దోహదపడుతుందని, 2024 సార్వత్రిక ఎన్నికలపై దీని ప్రభావం ఉంటుందని తెలిపారు.

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

కార్యవర్గ సభ్యులు) కె. రామాంజనేయులు, ఆహ్వానసంఘం సభ్యులు(విజయవాడ నగర కార్యదర్శి) జి.కోటేశ్వరరావుతో కలిసి ఆయన విడుదల చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. మోదీ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికశక్తులను ఏకతాటిపైకి తీసుకురావడానికి సీపీఐ జాతీయ మహాసభలు వేదిక కానున్నట్లు తెలిపారు. మూడేళ్లకోసారి నిర్వహించాల్సిన మహాసభలు కరోనా వల్ల నాలుగేళ్లకు జరుపుతున్నామన్నారు. జాతీయ మహాసభలు 47ఏళ్ల తరువాత విజయవాడలో నిర్వహించాలని జాతీయ కమిటీ నిర్ణయించిందన్నారు. ఇదే విజయవాడలో 1961లో సీపీఐ 6వ జాతీయ మహాసభలు, 1975లో 10వ మహాసభలు జరిగాయని గుర్తుచేశారు. అక్టోబర్ 14న విజయవాడలో భారీ ర్యాలీ, బహిరంగసభ నిర్వహిస్తామని, దీనికి పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా తదితర నాయకులు పాల్గొంటారని తెలిపారు. అన్ని రాష్ట్రాల నుంచి 1000 మంది ప్రతినిధులు వస్తున్నారని, ఇతర దేశాల కమ్యూనిస్టు నాయకులు సౌహార్ద ప్రతినిధులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సీపీఎం నుంచి సీతారామ్ ఏచూరి, ఇతర వామపక్ష పార్టీల జాతీయ నాయకులు సౌహార్థ సందేశం ఇస్తారన్నారు. మోదీ ప్రభుత్వం కేంద్రంలో నియంత పాలన చేస్తోందని రామకృష్ణ విమర్శించారు. ప్రతిపక్షాలను అణచివేయడానికి వ్యవస్థలను వాడుకుంటూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. మోదీ పాలనలో దేశం అన్నివిధాలా నష్టపోయిందని, ప్రజాస్వామ్యానికి పాతరేసి, ఏకవ్యక్తి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అన్యాయంగా జైళ్లలో పెడుతున్నారన్నారు. సీబీఐ, ఐటీ వాళ్లతో బెదిరిస్తున్నారని, ఇటీవల సోనియాగాంధీని కూడా విచారణ పేరుతో ఇబ్బందులు పెట్టారని చెప్పారు. మోదీ ఎనిమిదేళ్ల పాలనలో దేశం అప్పుల పాలైందన్నారు. నల్లధనాన్ని వెనక్కి తేలేదని, ఉద్యోగాల ఊసేలేదని విమర్శించారు. మోదీ అధికారం చేపట్టే నాటికి రూ.47 లక్షల కోట్లు అప్పు ఉంటే...ఇవాళ రూ.155 లక్షల కోట్లకు చేరిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేశారని మండిపడ్డారు. కొత్తగా ఒక్క పరిశ్రమ నెలకొల్పని ఏకైక ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ రికార్డు సృష్టించారన్నారు. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలు పెరిగాయన్నారు. సర్వం కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం చేస్తున్నారని, మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాజ్యాంగాన్ని మూలన పడేయడం ఖాయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ మోదీ విస్మరించారన్నారు.

మోదీకి సీఎం జగన్, టీడీపీ నేత చంద్రబాబు నిస్సిగ్గుగా భజన చేస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు. మోదీతో చంద్రబాబు చేయి కలిపారని, జగన్ కలిసి భోజనం చేశారంటూ వారిని వారే తగ్గించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మోదీ చేయివేస్తే పులకరించి పోవడం సరికాదన్నారు. రాష్ట్రానికి రావాల్సినవి అడక్కుండా పూర్తిగా దిగజారి వ్యవహరిస్తున్నారన్నారు. విజయసాయిరెడ్డి ఓ కళాకారుడని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్నట్లు ప్రజలను మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్‌ప్లాంట్ పోరాటాలు వదిలి, వాట్సాప్‌లలో పోరాటాలు చేస్తున్నారన్నారు. ఎంపీలు ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని చంద్రబాబు, జగన్ దిల్లీలో తాకట్టు పెట్టొద్దని, వ్యక్తిత్వంతో మెలగాలని హితవు పలికారు. మహాసభలు వేదికగా అన్ని అంశాలపై చర్చిస్తామన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర వాదులను ఐక్యం చేస్తామన్నారు. అక్టోబరులో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

ఓబులేసు మాట్లాడుతూ ఉమ్మడి జాబితాలోని అంశాలు విద్య, వైద్యం, నీరు, విద్యుత్ తదితరాలను మోదీ ప్రభుత్వం తమ గుప్పెట్లో పెట్టుకుని సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే విద్యుత్ సంస్కరణలను ప్రవేశపెట్టిందన్నారు. 45 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా సవరించి, దానిని ఆమోదింపచేయడానికి తిరుపతిలో ఈ నెల 25, 26 తేదీలో అన్ని రాష్ట్రాల కార్మిక శాఖాధికారులు, మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఆ సందర్భంగా ఏఐటీయూసీ అధ్వర్యంలో నిరసన తెలుపుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాట కార్యక్రమాలను మహాసభల వేదికగా రూపొందిస్తామని వెల్లడించారు.

మహాసభలకు విరాళాలిచ్చి సహకరించండి: జల్లి విల్సన్

జల్లి విల్సన్ మాట్లాడుతూ మహాసభలు, ఉద్యమాల నిర్వహణకు సంబంధించి విజయవాడకు గొప్ప పేరుందని చెప్పారు. గత సభలకు దేశ నలుమూలల నుంచి తరలి వచ్చిన లక్షలాది మంది పార్టీ శ్రేణులకు విజయవాడ వేదికగా భోజన, వసతి తదితర సకల సౌకర్యాలు కల్పించిందని గుర్తుచేశారు. అదే సంప్రదాయాన్ని పాటించేందుకు కృషి చేయాలని కోరారు. దేశంలో వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక వాదులంతా ఏకం కావాలని కాంక్షించే వారంతా పార్టీ జాతీయ మహాసభల విజయవంతానికి పెద్ద మనస్సుతో విరాళాలిచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తురాలిపై దొంగబాబా అత్యాచారం

భోపాల్/గ్వాలియర్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఓ మహిళా భక్తురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై తనకు తాను దైవంగా ప్రచారం చేసుకుంటున్న స్వామి వైరాగ్యానంద్ గిరిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. గ్వాలియర్‌లోని ఓ హోటల్‌లో నిందితుడిని అరెస్టు చేసినట్లు గ్వాలియర్ ఎస్పీ అమిత్ సంఘీ తెలిపారు. భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 376 (రేప్) కింద అతడిపై కేసు నమోదు చేసినట్లు అదనపు పోలీసు కమిషనర్ (ఏసీపీ) రిచా చౌబే భోపాల్‌లో వెల్లడించారు. నిందితుడిని భోపాల్ కోర్టులో హాజరుపర్చగా, ఆగస్టు 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. సోమవారం మహిళా భక్తురాలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... నిందితుడు వైరాగ్యానంద్ గిరి జులై 17న భోపాల్‌లో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పెళ్లయి చాల కాలమైనా తనకు సంతానం లేదని తనను సంప్రదించిన బాధిత మహిళకు కొన్ని పూజలు చేసినట్లయితే గర్భం దాల్చుతావని చెప్పాడు. అయితే గిరి ఇచ్చిన నైవేద్యాన్ని తిన్న తాను స్పృహతప్పి పడిపోగా తనపై అత్యాచారం చేశాడని బాధిత మహిళ ఆరోపించింది. పరువు పోతుందన్న భయంతో వెంటనే ఫిర్యాదు చేయలేకపోయానని బాధితురాలు పేర్కొన్నట్లు ఏసీపీ రిచా చౌబే తెలిపారు. గత రాష్ట్ర అసెంబ్లీ, లోకసభ ఎన్నికల్లో గిరి కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు.

బ్యాంకుల ప్రైవేటీకరణకు ప్రతిఘటన

మాట్లాడుతున్న వెంకటాచలం. వేదికపై ఓబులేసు, రవీంద్రనాథ్, శంకర్, ఉదయ్‌కుమార్, రాంబాబు, శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన బ్యాంకుల ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రతిఘటించాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకటాచలం పిలుపునిచ్చారు. విజయవాడ బందరురోడ్డు ఏ+1 కన్వెన్షన్ హాలులో మంగళవారం బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ యూనియన్ మొదటి త్రై వార్షిక మహాసభలు జరిగాయి. సభకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటాచలం మాట్లాడుతూ... నాడు అనేక పోరాటాల ఫలితంగా బ్యాంకుల జాతీయకరణ జరిగిందని గుర్తుచేశారు. మోదీ అధికారంలోకి వచ్చాక బ్యాంకుల ప్రైవేటీకరణ విధానాల్ని అనుసరిస్తూ, కార్పొరేట్ కంపెనీలకు సహకరిస్తున్నారని విమర్శించారు. బ్యాంకులకు కోట్లాది రూపాయల రుణాలను ఎగ్గొట్టిన వారిపై చర్యలు తీసుకోకుండా కేంద్రం కాలయాపన చేస్తోందన్నారు. బ్యాంకుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ నిరంతరం ఉద్యమిస్తోందని చెప్పారు. దేశంలో 1969లో 14 ప్రధాన బ్యాంకులను జాతీయం చేశాక, 53ఏళ్లలో బ్యాంకులు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. వేలాది బ్యాంకు శాఖలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించడం ద్వారా సామాన్యుల చెంతకు సైతం సేవలు చేర్చగలిగామని పేర్కొన్నారు. గృహ విద్యా, గ్రామీణాభివృద్ధికి, దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికంగా రుణాలు ఇచ్చి దేశాభివృద్ధికి కృషి చేశాయని చెప్పారు. జాతీయ బ్యాంకులే ప్రాధాన్యత రంగాలకు రుణాలు ఇస్తున్నాయని నొక్కిచెప్పారు. ఇప్పటికే ప్రభుత్వానికీ, బ్యాంకు ఉద్యోగుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడు విడతలుగా సమ్మె చేశామన్నారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో బ్యాంకుల ప్రైవేటీకరణ బిల్లు ప్రవేశ పెట్టడం లేదంటూ కేంద్రం ప్రకటించినప్పటికీ, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ... ఏఐటీయూసీ ఆవిర్భావం నుంచి బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విశేష కృషి చేస్తోందన్నారు. అనేక పోరాటాలను నిర్మించి, కార్మికుల పని పరిస్థితుల మెరుగుదలకు విశిష్ట కృషి చేసిందన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న బ్యాంకుల ప్రైవేటీకరణ విధానాలను తిప్పి కొట్టే దిశగా ఉద్యోగులు ఉద్యమించాలని కోరారు. రాబోయే రోజుల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు. ఉద్యోగులు చేపట్టే ప్రతి ఉద్యమానికి ఏఐటీయూసీ సంపూర్ణ సంఘీభావం తెలుపుతుందన్నారు.

విశిష్ట అతిథులుగా హాజరైన ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శులు శంకర్, ఉదయ్‌కుమార్, కార్యదర్శి బీఎస్ రాంబాబు మాట్లాడుతూ... బ్యాంకుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని చెప్పారు. జాతీయ బ్యాంకులతోనే ప్రజలకు భద్రత ఉందన్నారు. బ్యాంకుల జాతీయకరణకు ముందు చాలా ప్రైవేట్ బ్యాంకులు తప్పుడు విధానాల్ని అనుసరించడంతో కుప్పకూలిపోయాయని, ప్రజలు తాము దాచుకున్న సొమ్ము నష్టపోయారని గుర్తుచేశారు.

తొలుత ఆహ్వాన సంఘం చైర్మన్ వై.శ్రీనివాసరావు మొదటి త్రై వార్షిక మహాసభల నివేదికను వివరించారు. ఏఐటీయూసీ ఆవిర్భావం నుంచి బ్యాంకు ఉద్యోగులకు వెన్నుదన్నుగా నిలిచిన విధానాన్ని, ఉద్యమాల గురించి పేర్కొన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ... బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రభుత్వాలు విరమించాలని, లేకుంటే బ్యాంకు ఉద్యోగులంతా ఐక్య పోరాటాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ సభలో విశాఖపట్నం జనరల్ మేనేజర్ కేఎస్‌డీఎస్ ప్రసాద్, ఏపీటీబీఎఫ్ అధ్యక్షుడు టి.రవీంద్రనాథ్, కోర్ కమిటీ సభ్యుడు విన్సెంట్ సౌజా, అసోసియేషన్ నేతలు, వివిధ ప్రాంతాలకు చెందిన బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నేత రామారావు మృతి

ఏఐటీయూసీ, ఈయూ నేతల సంతాపం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏఐటీయూసీ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు సుదీర్ఘకాలం నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించిన బి.రామారావు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. 1988 నుంచి 2002 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, ఆ తర్వాత 2006 వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ఆయన విశేష కృషి చేశారు. ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న కాలంలో 24 రోజులపాటు నిరవధిక సమ్మె చేపట్టి కార్మికులకు మొట్టమొదటిసారిగా ఫిట్‌మెంట్ ఇప్పించారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి రాష్ట్రంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనేక పోరాటాల్లో కీలకంగా వ్యవహరించారు. కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురైన రామారావు..హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు, ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. రామారావు మంచి వక్త, ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతోపాటు యాజమాన్య, ప్రభుత్వ తప్పుడు విధానాలను కార్మికులకు అర్థమయ్యేలా వివరించ డంలో మంచి నేర్పరి అని ఓబులేసు కొనియాడారు. ఆయన మృతి కార్మిక వర్గానికి ప్రత్యేకించి ఆర్టీసీ కార్మికులకు తీరనిలోటని పేర్కొన్నారు. రామారావు మృతికి సంతాప సూచికంగా ఏపీ, తెలంగాణల్లో ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డిపోల వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆంధ్రప్రదేశ్/తెలంగాణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వైవీ రావు, పలిశెట్టి దామోదరరావు, యస్.బాబు, కె.రాజిరెడ్డి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈయూ మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యస్‌ఏ ఖాన్, కె.పద్మాకర్, ఉపాధ్యక్షుడు జీడీ ప్రసాదరెడ్డి సంతాపం తెలిపారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డప్పుల మోత, గిరిజన, లంబాడీల సాంప్రదాయ నృత్యాలతో సందడిగా మారింది. ఆదివాసీ కులదేవతల చిత్రపటాలు, అంబేద్కర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వైసీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజ్యోత్ హనుమంతు నాయక్ రాష్ట్రపతి ముర్ముకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను గిరిజనుల చెంతకు చేరుస్తు న్నట్టు చెప్పారు. హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ, గిరిజనులకు విద్య, వైద్యం అందుబాటులోకి తేవడంలో జగన్ సఫల మయ్యారన్నారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, గిరిపుత్రుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. నవరత్నాల అమలు కమిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, మాజీ ఎంపీ శంకర్రావు, గిరిజన రాష్ట్ర నేతలు సృజన, జి.సురేంద్ర, మేడా రమేష్ , వై.వెంకటసుబ్బయ్య, విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర చైర్మన్ బందెల కిరణ్‌రాజు పాల్గొన్నారు.

గిరిపుత్రుల సంక్షేమానికి కృషి-సీఎం: గిరిపుత్రుల జీవనశైలిని కాపాడుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు సీఎం జగన్ తెలిపారు. కొండకోనల్లో ఉంటూ ప్రకృతిని కాపాడు తున్న అడవి బిడ్డలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజనులకు ప్రాధాన్యమిస్తూ కొత్తగా రెండు జిల్లాలను ఏర్పాటు చేసుకున్నామని జగన్ ట్వీట్ చేశారు.

సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అన్ని అర్హతలున్న గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఏపీజీడబ్ల్యూఎస్‌ఈడబ్ల్యూఓ) కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. రాష్ట్ర అడ్‌హక్ ప్రెసిడెంట్ ఎ.సాయినాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి బొప్పరాజుతో పాటు ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డి.ఈశ్వర్, నాయకులు కె.సురేంద్ర, ఎస్.కృష్ణమోహన్, ఎస్.మల్లేశ్వరరావు, కిశోర్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ సభ్యులు, జిల్లా నాయకులు హాజరయ్యారు. బొప్పరాజు మాట్లాడుతూ, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని, మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, అర్హులైన వారికి కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కమిటీలను బొప్పరాజు అభినందించారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు షమీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి అరలయ్య, కోశాధికారి సల్మాన్‌బాషా, నాయకులు జగదీశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పసర మందు వికటించి చిన్నారి మృతి



విశాలాంధ్ర-కురుపాం: పసరమందు వికటించి నాలుగు నెలల పసికందు మృత్యు ఒడికి చేరింది. కంప్యూటర్ యుగంలోనూ ఆదివాసీ ఆచార అలవాట్లు ఇంకా పురాతన పద్ధతుల్లోనే కొనసాగుతున్నాయని చెప్పటానికి ఇదో నిదర్శనం. వివరాల్లోకి వెళితే ... పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం పెదగొత్తిలి పంచాయతీ భారామణికి చెందిన ఆరిక గ్రేష్మ (4 నెలలు) అనారోగ్యంతో బాధపడుతుండగా పసరమందు పట్టారు. కొంత సమయం తర్వాత ఊపిరి తీసుకోవటానికి ఇబ్బంది పడుతుండటాన్ని గుర్తించిన తల్లిదండ్రులు హుటాహుటిన గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి 108లో తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం అత్యవసర వైద్యం కోసం పార్వతీపురం తరలించేందుకు ప్రయత్నం చేస్తున్న తరుణంలో మార్గమధ్యంలో చిన్నారి మృతి చెందింది. గ్రేష్మ తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు కావటం విశేషం.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ వినియోగదారుల నుంచి 36 నెలలపాటు ట్రూ అప్ చార్జీలు వసూలు చేయాలన్న విద్యుత్ పంపిణీ సంస్థల నిర్ణయాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, అధిక ధరలతో సతమతమవుతున్న ప్రజలపై ట్రూఅప్ చార్జీల భారం వేయాలన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. 2014-15 నుంచి 2018-19 వరకు డిస్కమ్‌లకు వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి వినియోగదారుల నుండి 36నెలల పాటు వసూలు చేయాలని వివిధ పంపిణీ సంస్థలు తాజాగా నిర్ణయం తీసుకున్నాయన్నారు. గతంలో యూనిట్‌కు రూ.1.27 చొప్పున ట్రూఅప్ చార్జీలు వసూలు చేసినదానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయని, నెలలపాటు వసూలు చేసిన మొత్తాన్ని తర్వాత బిల్లుల్లో సర్దుబాటు చేశారని వివరించారు. ఈసారి అలా కాకుండా అత్యధిక జిల్లాల్లో యూనిట్‌కు 0.22పైసల చొప్పున ఈనెల నుంచి మూడేళ్లపాటు వసూలు చేయబోతున్నారని తెలిపారు. ట్రూఅప్ చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మాధవ్ బాగోతానికి సమర్థింపు నీచం

- టీడీపీ పొలిట్ బ్యూరో
- ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా 15న ర్యాలీలు
- పార్టీలో యువతకు ప్రాధాన్యం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారత ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ నెల 13,14,15 తేదీల్లో జరిగే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొనాలని ఆ పార్టీ టీడీపీ పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. ఆగస్టు 15వ తేదీ ర్యాలీలు, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం పార్టీ కేంద్ర కార్యాల యంలో జరిగిన ఈ సమావేశంలో తీర్మానాలు చేశారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారి గాథలను ప్రజల్లో తీసుకు వెళ్లి యువతలో దేశభక్తి పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి తెలుగుదేశం కార్యకర్త, నాయకుడు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని, అన్ని చోట్లా వేడుకలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన పనిని పొలిట్ బ్యూరో తీవ్రంగా తప్పుపట్టింది. డర్టీ జె గ్యాంగ్ వల్ల మహిళా భద్రత ప్రమాదంలో పడింది. వైసీపీ డర్టీ పిక్చర్ రాష్ట్రానికే అవమానం, గోరంట్ల మాధవ్ చట్ట సభల్లో, రాజకీయాల్లో ఉండటానికి అనర్హుడని తక్షణమే అతన్ని భర్తరఫ్ చేయాలని సమావేశం డిమాండు చేసింది. మాధవ్ చేసిన పనికంటే ఆ పనికి సీఎం జగన్ రెడ్డి సమర్థన మరింత నీచంగా ఉందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఇదే అంశంపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తుండగానే వైసీపీ రౌడీలు ఫోన్ చేసి బెదిరించడాన్ని సమావేశం ఖండించింది. గోదావరి వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పెరిగిన ధరలు, ఖర్చులు, వరదల తీవ్రత కారణంగా పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండు చేసింది. పోలవరం ప్రాజెక్టుకు ముంపు బాధితులకు జగన్ రెడ్డి హామీ మేరకు ఆర్ అండ్ ఆర్ పరిహారం రూ.10 లక్షలు, సేకరించిన భూమికి రూ.5 లక్షలు ఎందుకు ఇవ్వలేదని పొలిట్ బ్యూరో ప్రశ్నించింది. పాఠశాలల విలీనంతో లక్షలాది మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యావకాశాల్ని దూరం చేసిందని, ఆ నిర్ణయాన్ని ఇప్పటికైనా ఉపసంహరించుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించింది. ఇక పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సంస్కరణలు తీసుకురావడంతో పాటు యువతకు భాగస్వామ్యంపై పొలిట్ బ్యూరోలో చర్చ జరిగింది. పార్టీలో నూతనత్వం, యువతను తీసుకువచ్చేందుకు సలహాలు, సూచనలు స్వీకరించి ఒక నివేదిక సమర్పించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. బీసీ జనగణన చేయాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.

గిరిజనులకు తీవ్ర అన్యాయం

వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పొలిట్‌బ్యూరో సమావేశానికి ముందుగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్ర మంలో ఆయన పాల్గొని టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి అమలు చేసిన కార్యక్రమాలను, ప్రస్తుతం వారికి జరుగుతున్న అన్యాయాలను వివరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నా యుడు, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు కత్తి పద్మా, నరహరిప్రసాద్, దారు నాయక్ తదితరులు ప్రసంగించారు.

ఏఎన్‌ఎంలను జీరో సర్వీసుతో కౌన్సెలింగ్ చేయండి

ఏపీఎన్‌జీవో నేతల డిమాండ్

విశాలాంధ్ర-పార్వతీపురం: వైద్య ఆరోగ్య శాఖలో సేవలు అందించడంలో ముందుండే ఏఎన్‌ఎంలను జీరో సర్వీసుతో కౌన్సెలింగ్ చేయా లంటూ ఏపీ ఎన్‌జీవో నేతలు మంగళవారం డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ పేరిట ఏఎన్‌ఎం లను సచివాలయాల్లో నియమించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీంతో ఎన్నో ఏళ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న తమకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని వారు వాపో తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, కానీ అందరినీ జీరో సర్వీసుతో కౌన్సెలింగ్ చేయాలని మైదాన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సచివాలయాల్లో ఖాళీలను రెగ్యులర్, మొదటి ఏఎన్‌ఎంలతో భర్తీ చేసేందుకు మ్యాపింగ్ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా మైదాన ప్రాంతాల్లో ఏళ్లతరబడి పనిచేస్తున్న తమను రేషనలైజేషన్ పేరిట గిరిజన ప్రాంతాల సచివాలయాలకు పంపించడానికి ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తుందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామంటూ వారంతా ఆందోళనకు సిద్ధపడుతున్నారు. పనిచేయడానికి తాము ఎప్పుడు వ్యతిరేకంకాదని, తమకు తగు న్యాయం చేయాలని రెగ్యులర్ ఏఎన్‌ఎంలు కోరుతున్నారు. తమను సచివాల యాలకు మ్యాపింగ్ చేసే బాధ్యతలు వైద్య అధికారులకు ఇవ్వడం జరిగిందని, చాలామంది నిబంధనలకు వ్యతిరేకంగా మ్యాపింగ్ చేశారు కాబట్టే తక్షణమే ఇటువంటి మ్యాపింగ్ విధానాన్ని రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు అందరితోపాటే జీరో సర్వీస్‌తో కౌన్సిలింగ్ నిర్వహించాలని, అందరికీ ఒకేవిధంగా రూల్స్ వర్తింపజేయాలని పార్వతీపురం మన్యంజిల్లా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు జీవీఆర్‌ఎస్ కిషోర్, కార్యదర్శి పీ పద్మ, జీ సత్యనారాయణ, జీ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండేళ్లపాటు కరోనా నుంచి ప్రజలను కాపాడి మనమంతా ఆరోగ్యంగా ఉండడానికి ఏఎన్‌ఎంల సేవలే ప్రధాన కారణమని, దీన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. నియమాలకు వ్యతిరేకంగా మ్యాపింగ్ చేసి బదిలీచేస్తే సంఘటితంగా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నీరు-చెట్టు బకాయిలు వచ్చేలా చూడాలి

చంద్రబాబుకి సాగునీటి సంఘాల నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత మూడేళ్లుగా నీరు-చెట్టు బిల్లులు పెండింగ్ లో పెట్టడం దారుణమని, హైకోర్టు ఆదేశాలను సైతం అమలు చేయని ప్రభుత్వతీరుపై ధిక్కార పిటిషన్లు వేసి రైతులకు అండగా ఉండాలని నీరు-చెట్టు ఫిర్యాదుల విభాగానికి చంద్రబాబు సూచించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నీరు-చెట్టు ఫిర్యాదుల విభాగం బాధ్యులు,సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు కలిసి పెండింగ్ బిల్లుల పురోగతిని నివేదించారు. నీరు-చెట్టు బిల్లులు అందక రైతుల ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. నీరు-చెట్టు నిధుల విడుదలకు జూన్ నెలలో జీ.వో లు మాత్రమే ఇచ్చి రైతుల ఖాతాలకు ఇప్పటి వరకు నగదును జమ చేయకపోవడం చాలా దారుణం అన్నారు. ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, నేటివరకు 3661 మంది గౌరవ హైకోర్టును ఆశ్రయించగా, ఆరువారాల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆదేశాలిచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయడం లేదని, దీంతో సుమారు 600 మంది బాధిత రైతులు ధిక్కార పిటిషన్లు వేశారని తెలిపారు. ఈ పనులు చేసిన రైతులు కోట్ల డబ్బు ఉన్న కాంట్రా క్టర్లు కాదని, కేవలం గ్రామాల్లో అభివృద్ధి కోసం పనులు చేసిన అభివృద్ధికాముఖులు అని గుర్తించి, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెమోల పేరుతో కక్షపూరిత ధోరణిని విడనాడి బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు పోతుగంటి పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు శుభాకాంక్షలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమరావతి: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయం దేశానికి ఎంతో వన్నెతెచ్చిందన్నారు. ప్రకృతిని కాపాడుతున్న కల్లాకపటం తెలియని, కల్మషం లేని గిరిపుత్రుల జీవనశైలిని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉందని పేర్కొన్నారు. వారి జీవన శైలితోపాటు సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మారుమూల గిరిజన తండాలలో కూడా అధునాతన వైద్య సేవలను ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని, వారికి ఆరోగ్య భద్రత కల్పించాలని, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు. కొండ కోనల్లో ఉంటూ, ప్రకృతిని కాపాడుతున్న అడవి బిడ్డలకు ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

విశాలాంధ్ర- చింతూరు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మోదక్ పాల్ అటవీ ప్రాంతంలో మంగళవారం మావోయిస్టులకు, పోలీసులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనా స్థలంలో రక్తపు మడుగులు, మృతదేహాలను ఈ డ్చుకుపోయిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. కాల్పుల్లో చాలామంది మావోయిస్టులు మృతిచెంది ఉండవచ్చునని బస్తర్ డీఐజీ సుందర్ రాజ్ పట్నా, బీజాపూర్ ఎస్పీ ఆంజనేయ, సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఎస్‌కే మిశ్రా భావిస్తున్నారు. గాయపడిన ఒక మావోయిస్టును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఇన్సాస్, 303 రైఫిల్, మావోయిస్టు సాహిత్యం, సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గోరంట్ల మాధవ్‌పై చర్య తీసుకోండి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎంపీ గోరంట్ల మాధవ్ నగ్న వీడియో వ్యవహారంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు టీడీపీ ఎంపీలు ఫిర్యాదు చేశారు. అత్యంత జుగుప్సాకరంగా వ్యవహరించిన మాధవ్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీ రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ గోరంట్లపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరామని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. జాతీయ మహిళా కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. గోరంట్లను కాపాడాలని వైసీపీ నేతలు యత్నించడం దుర్మార్గమన్నారు. గోరంట్ల వీడియో ఘటనను సజ్జల రామకృష్ణారెడ్డి నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీలో గోరంట్ల మాధవ్ ఒక్కరే కాదని, అలాంటి వారు ఎంతోమంది ఉన్నారన్నారు. ఆయనపై చర్యలు తీసుకుంటే..ఇతర నేతలపైనా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, అదే జరిగితే వైసీపీ ఖాళీ అవుతుందని భయపడుతున్నారని విమర్శించారు. మహిళల గౌరవం కాపాడేందుకు టీడీపీ పోరాటం చేస్తోందని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యుడు ఇలా చేస్తే ప్రజలు ఏమనుకుంటారో అన్న ఇంగితజ్ఞానం వైసీపీ అధినాయకులకు లేకపోవడం సిగ్గు చేటన్నారు. మహిళల గౌరవం కోసం గోరంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాధవ్ వీడియో వెనుక టీడీపీ కుట్ర ఉందని అంటున్నారని, అలా మాట్లాడడానికి సిగ్గుండాలన్నారు. చర్యలు తీసుకుంటామని చెప్పిన సజ్జల.. మళ్లీ ఎందుకు మాట మార్చారని ప్రశ్నించారు. వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపడానికి ఎన్ని రోజులు పడుతుందని నిలదీశారు. మాధవ్‌పై చర్య తీసుకునే పరిస్థితి కనిపించడం లేదని రామ్మోహన్ నాయుడు అన్నారు.

మినీ ఐటీడీఏ ఏర్పాటు చేయండి

తలకు ఆకుటోపీలతో గిరిజనుల ఆందోళన

విశాలాంధ్ర-శృంగవరపుకోట: విజయనగరం జిల్లాలో మినీ ఐటీడీఏ ఏర్పాటు చేసి గిరిజన బతుకులను తీర్చిదిద్దాలని ఏపీ గిరిజన సంఘం నాయకుడు జరత గౌరీష్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తలకు ఆకు టోపీలు ధరించి మంగళవారం గిరిజనులు నిరసన తెలిపారు. గౌరీష్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఎస్.కోట, గంట్యాడ మండలం దారపర్తి, బొడ్డవర , రేగ పుణ్యగిరి, వేపాడలోని మారిక, గంట్యాడ మండలం డి.కె.పర్తి పంచాయతీల్లో వేలాది మంది గిరిజనులు నివసిస్తున్నారన్నారు. మైదాన ప్రాంతంలోనూ, కొండ కోనల్లోనూ నివసిస్తున్న గిరిజనులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి... ఎవరు తీరుస్తారు... అని ప్రశ్నించారు. జిల్లా రెండుగా విడిపోయాక, చాలామంది గిరిజనులకు ఆర్ఏఫ్ పట్టాలు లేవనీ, ఐటీడీఏ లోన్లు, భూ అభివృద్ధిపై సబ్సిడీలు, హెల్త్ ఎమర్జెన్సీ పాస్ లు ఎవరిస్తారని అన్నారు. కొన్ని గ్రామాల్లో పెత్తందారుల ఆగడాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, ఎస్టీ కోటాలో విద్యాసంస్థల్లో సీట్ల కేటాయింపులు, స్కాలర్‌షిప్స్ తదితర సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. దారపర్తి, మారికలో డీకే పర్తి పంచాయతీల్లో రహదారులు, మంచినీరు, పాఠశాలల సౌకర్యాలు కల్పించాలని కోరారు. డోలిమోతలు లేకుండా చూడాలని మంత్రి, కలెక్టర్‌లకు విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

బిహార్‌లో బీజేపీ ఎత్తుగడలు చిత్తు

బిహార్‌లో బీజేపీతో నితీశ్ కుమార్ కలహాల కాపురం ముగిసింది. ఎన్.డి.ఎ. కూటమి నుంచి నితీశ్ కుమార్ మంగళ వారం వైదొలగారు. ముఖ్యమంత్రి పదవికి నితీశ్ మంగళవారం సాయంత్రం రాజీనామా చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడడమే తరువాయి. అయితే కొత్త ప్రభుత్వంలో కూడా నితీశ్ కుమారే ముఖ్యమంత్రిగా ఉంటారు. అధికారం కోసం జె.డి.(యు) అధినేత బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసినా సైద్ధాంతికంగా నితీశ్ పార్టీకి, బీజేపీకి పొసగదని ముందే తెలుసు. నితీశ్ కుమార్ సోష లిస్టు భావజాలం ఉన్న వ్యక్తి. 1974–75లో జై ప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో సంపూర్ణ విప్లవం నేపథ్యంలో రాజకీయంగా ఆయన ఎదిగారు. బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తరవాత విడ పోవడం నితీశ్‌కు ఇది రెండవ సారి. బీజేపీకి, నితీశ్ కుమార్‌కు ఏ మాత్రం పొసగడం లేదని గత రెండు నెలలుగా జరిగిన పరిణామాలు నిరూ పిస్తూనే ఉన్నాయి. చివరకు అనివార్యంగా ఈ అసహజ సంకీర్ణ ప్రభుత్వం పతనం కాక తప్పలేదు. ప్రధాన ప్రతిపక్షమైన రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.) తో కలిసి నితీశ్ ప్రభుత్వం ఏర్పాటు చేయ బోతున్నారు. ఈ రెండు పార్టీలు కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడం కూడా ఇది మొదటి సారి కాదు. ఇంతకు ముందు నితీశ్ నాయకత్వంలోని జె.డి.(యు), లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వీ యాదవ్ నాయ కత్వంలోని ఆర్.జె.డి. కలిసి ప్రభుత్వాన్ని నడిపినప్పుడు లాలూ కుమారు లిద్దరితో వేగడం నితీశ్‌కు అసాధ్యమైంది. అప్పుడు తేజస్వీ మీద నితీశ్ అవినీతి ఆరోపణలు మోపారు. మొత్తం మీద ఆ ప్రభుత్వం పతనం అయింది. నితీశ్ ఏ మాత్రం ఆలస్యం చేయకుండా బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఎన్.డి.ఎ. గూటిలో చేరిపోయారు. నిజానికి ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షంలో ఇంతవరకు ఉన్న చెప్పుకోదగ్గ పార్టీ నితీశ్ నాయకత్వంలోని జె.డి.(యు) మాత్రమే. మంగళవారం నితీశ్ కుమార్ తన పార్టీ ఎమ్మెల్యేలను, ఎంపీలను పిలిపించి సమావేశం ఏర్పాటు చేసి బీజేపీతో తెగతెంపులు చేసుకుందామని ప్రకటించి వారి ఆమోదం పొందారు. బీజేపీతో విడిపోతే మద్దతు ఇవ్వడానికి ఆర్.జె.డి., కాంగ్రెస్, వామపక్షాలు అంతకుముందే అంగీకరించాయి. మంగళవారం జె.డి.(యు) ఎమ్మెల్యేల, ఎంపీల సమావేశం జరిగినట్టే ఆర్.జె.డి. శాసనసభ్యుల సమావేశం కూడా జరిగింది. అందులో నితీశ్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. నితీశ్ కుమార్ అధికారంకోసం ఎవరితోనైనా పొత్తు కూడగలరన్న అపఖ్యాతి ఉన్న మాట వాస్తవమే. తేజస్వీ యాదవ్ ఆయనను "పల్టూ చాచా" అని సంబోధించేవారు. ఇటీవలి కాలంలో చాలా మంది నితీశ్‌ను "కుర్సీ రాం" అని కూడా అంటున్నారు. ఈ దృష్టితో చూస్తే నితీశ్ కుమార్ అధికార దాహం అపారం అనిపించక మానదు. ఆ మాట నిజమే కావచ్చు కానీ బిహార్ రాజకీయాలలో నితీశ్ అనివార్యత అంతకన్నా పెద్ద కారణం. 2020లో జరిగిన శాసన సభ ఎన్నికలలో బీజేపీకి 77 స్థానాలు, జె.డి.(యు)కు 45, ఆర్.జె.డి.కి 75 స్థానాలు, కాంగ్రెస్‌కు 19 సీట్లు వచ్చాయి. 2020 ఎన్నికల తరవాత బీజేపీకి 77 స్థానాలున్నా 45 సీట్లు మాత్రమే ఉన్న జె.డి.(యు) నాయకుడు నితీశ్ కుమార్‌ను ముఖ్యమంత్రిగా అంగీకరించక తప్పలేదు. ఇటీవలే సుల్తాన్ అసదుద్దీన్ ఒవైసీ నాయకత్వంలోని మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ తరఫున ఎన్ని కైన అయిదుగురు శాసనసభ్యుల్లో నలుగురు ఆర్.జె.డి.లో చేరిపోయారు. దీనితో ఆర్.జె.డి. బలం 79కి పెరిగింది. అంటే ఆర్.జె.డి. అతి పెద్ద రాజ కీయ పార్టీ. ఇప్పుడు ఆర్.జె.డి. పరిస్థితీ అదే. ఆ పార్టీకి 79 స్థానాలున్నా నితీశ్‌నే ముఖ్యమంత్రిగా ఒప్పుకోక తప్పలేదు. బీజేపీని అధికారంలో లేకుండా చేయాలంటే తేజస్వీ యాదవ్‌కు గత్యంతరం లేదు.

బీజేపీతో కలిసి ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా తన భాగస్వామ్య పక్ష అస్తిత్వానికే ఎసరు పెట్టడం ఖాయం అని చాలాసార్లు రుజువైంది. మెజారిటీ లేని చోట్ల కూడా ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంకోసం బీజేపీ ఎన్ని అడ్డదార్లయినా తొక్కుతుంది. మహారాష్ట్రలో తాజాగా జరిగింది ఇదే. అక్కడ కూడా శివసేన తిరుగుబాటు వర్గ నాయకుడు ఏక్ నాథ్ షిందేను సమర్థించే వారికన్నా బీజేపీ ఎమ్మెల్యేల సంఖ్య చాలా ఎక్కువే అయినా షిందేకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వడానికి బీజేపీ అంగీకరించింది. అలా కలిసి ఉన్నట్టే ఉండి ఆ పక్షాన్నే మింగేసే రాజకీయాలు అనుసరించడం బీజేపీకి అలవాటైన వ్యవహారమే. దీర్ఘకాలికంగా శివసేనను బలవరచడానికి బీజేపీ అనుసరించిన వ్యూహం నచ్చకే ఉద్ధవ్ ఠాక్రే కాంగెస్, ఎన్.సి.పి.తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయవలసి వచ్చింది. చివరికి ఆ సర్కారును కూడా షిందే సహాయంతో బీజేపీ కూల్చేసింది. బిహార్‌లో కూడా జె.డి.(యు) అధ్యక్ష స్థానంలో ఉన్న ఆర్.సి.పి. సింగ్ సహాయంతో జె.డి.(యు)ను మింగే యడానికి బీజేపీ ప్రయత్నించింది. ఈ విద్యలో నిష్ణాతుడైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిహార్ రాజకీయాలలో కలగజేసుకుంటున్న తీరు నితీ శ్‌కు చికాకు కలిగించింది. తన అసంతృప్తిని నితీశ్ అనువైనప్పుడల్లా వెళ్లగక్కుతూనే వచ్చారు. బీజేపీ తన పార్టీని మింగేయకముందే సంకీర్ణ ప్రభు త్వం నుంచి తప్పుకోవడం మంచిదని నితీశ్ భావించారు. ఆ క్రమంలోనే ఆయన తేజస్వీ యాదవ్‌తో సఖ్యత పెంచుకున్నారు. పరస్పర విమర్శలు తగ్గాయి. పరిస్థితి అనుకూలించగానే నితీశ్ బీజేపీతో తెగ తెంపులు చేసుకున్నారు. నితీశ్ కొత్త దారి పట్టడానికి బీజేపీతో ఉన్న అసౌకర్యానికి తోడు ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ఒకప్పుడు బీజేపీయేతర పార్టీలు నితీశ్ కుమార్‌ను ప్రతిపక్ష కూటమి నాయకుడిగా భావిం చాయి. కానీ ఆయన బీజేపీతో వియ్యమంద డంతో ప్రతిపక్షాలు ఆయనను నమ్మడం మానేశాయి. అయితే సైద్ధాంతి కంగా బీజేపీయేతర పక్షాలతోనే నితీశ్‌కు సులభంగా పొసగుతుంది. ఇటీవలి కాలంలో 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీని నిలవరించడానికి ప్రతి పక్షాల ఐక్యత సాధించాలన్న దృష్టి పెరిగింది. అయితే ఆ ప్రతిపక్ష కూటమికి నాయకత్వంకోసం మమతా బెనర్జీ, కె. చంద్రశేఖర రావు, అరవింద్ కేజ్రీ వాల్ పోటీ పడ్తున్నారు. నాయకత్వం తమ చేతిలో లేకపోతే ప్రతిపక్ష ఐక్యతే లేదు అన్నంతదాకా వీరి తీరు వెళ్లింది. వీరందరితో పోలిస్తే మోదీకి ఎదు రొడ్డి నిలబడగలిగిన శక్తి నితీశ్ కుమార్‌కే ఉంది. ఆయన పిల్లి మొగ్గలు వేయకుండా ఉంటే కచ్చితంగా ప్రతిపక్ష నాయకులలో అగ్రాసనమే ఉండేది. అయితే ఇప్పటికైనా నితీశ్‌కు తన శక్తిసామర్థ్యాలతో పాటు సైద్ధాంతిక పునాది కూడా గుర్తొచ్చినట్టుంది. ప్రతిపక్ష కూటమికి నాయకత్వ స్థానాన్ని పూడ్చ గలిగే శక్తి కచ్చితంగా నితీశ్‌కు ఉంది. ఈ పరిణామాలన్నింటి పర్యవ సానం ఏమిటంటే భాగస్వామ్య పక్షాలను మింగేసే తిమింగలంలాంటి బీజేపీ నితీశ్ ఎత్తుగడల ముందు చిత్తుకాక తప్పలేదు.

నిబద్ధతకు మారు పేరు వెంకయ్యనాయుడు



డా॥ కె.నారాయణ

వాక్చాతుర్యంలో ఆయనకు ఆయనే సాటి. ఆయనే ముప్పవరపు వెంకయ్యనాయుడు. జీవరాశుల్లో మానవ జన్మ గొప్పది. అయితే సమాజాన్ని నడిపించేం దుకు ఒక చుక్కాని కావాలి. దాన్నే రాజకీయ వ్యవస్థగా అంగీకరించాం. ఎవరికివారు త్రికరణశుద్ధిగా నమ్మి నచ్చిన పార్టీలో చేరుతారు. నేను విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమం ద్వారా రాజకీయ వ్యవస్థను ఎంపిక చేసుకున్నాను. ఆ రాజకీయాలలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రజలకు మేలు చేస్తుందని నమ్మాను. అందులోనే కొనసాగు తున్నాను. అలాగే ముప్పవరపు వెంకయ్యనాయుడు కూడా నెల్లూరులో విద్యార్థి దశలోనే ఆర్ఎస్ఎస్ ప్రభావిత విద్యార్థి పరిషత్ ద్వారా జనసంఘ్ లోకి, అనంతరం జరిగిన సంస్థాగత మార్పుల కారణంగా బీజేపీలోకి చేరి చిత్తశుద్ధితో ఆ పార్టీకి అంకితమయ్యారు. సమయస్ఫూర్తి, కాలానుగుణమైన ఎత్తుగడలు, కలుపుగోలుతనం, మంచి మాట, మర్యాద వారి సొంతం. ఎంతటి సమూహంలో కలిసినా వారు నిబద్ధత దాటరు. ఏదైనా పని ఉండి వారిని కలిసి సాయం అడిగితే మీరు అడిగిన సాయానికి తమ పార్టీ వారు ఎవరైనా సిఫార్సు కోరితే ముందు వారినే సిఫార్సు చేస్తానని నిర్మొహ మాటంగా చెప్పేవారు. ఇటువంటి సందర్భం నాకు కూడా ఎదురయ్యింది. నెల్లూరు నుంచి విశాఖపట్నంలోని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చేరిన అనం తర కాలంలో జై ఆంధ్ర ఉద్యమం ఉవ్వెత్తున పడగవిప్పింది. ఆ ఉద్యమంలో వెంకయ్యనాయుడు చురుకైన పాత్ర వహించారు. సంపూర్ణ విప్లవం పేరుతో జయప్రకాశ్ నారాయణ నడిపిన ఉద్యమంలో వారితో పాటు పర్యటించి అను వాదకులుగా రాణించారు. తెలుగు తేజం ఎన్టీ రామారావు పదవీచ్యుతుడైన తరుణంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో జరిగిన ఉద్యమంలోనూ చురుకైన పాత్ర వహించారు. స్వతహాగానే మంచి ఉపన్యాసకుడు కావడంతో పాపులారిటీకి అది ఉపయోగపడింది. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చు కోవడం, లోపలా బయటా ఎన్ని యిబ్బందులొచ్చినా ఓర్పుగా, నేర్పుగా అధి గమించేవారు. సామాన్య కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఇంతింతై... వటుడింతింతై అన్న చందాన వెంకయ్య ఎదిగారు. వ్యవస్థలో అత్యున్నతమైన ఆ చివరి మెట్టు కూడా ఎక్కుతాడని అందరూ ఊహించారు. నేను తప్ప. అధ్యక్ష స్థానం అనేది నిస్సందేహంగా సానుకూలంగా ఉండాలి. అయితే ఇప్పుడున్నది స్వతంత్ర ఆలోచనలున్న వాజ్‌పాయ్ ప్రభుత్వం కాదు. మోదీ ప్రభుత్వం కాబట్టే ఆమ్రపాలి అటలోలా ఉవ్వెత్తున ఎగసి ముగింపు పలకాల్సి వచ్చింది. నమ్మిన విధానాలకు అంకితం అవ్వడం. తాత్కాలిక ప్రలోభాలకు గురికాకుండా ఉంటే సంతృప్తి మిగులుతుంది. సంతృప్తిని మించిన సంపద మానవ జీవితానికి ఏదీ లేదు. వెంకయ్య నమ్మిన సిద్ధాంతానికి మా సిద్ధాం తానికి దూరమే కాదు వైరం కూడా. అయినా నమ్మిన విధానానికి కట్టుబడి పని చేసి ఉపరాష్ట్రపతి పదవీ విరమణ చేస్తున్న వెంకయ్యనాయుడికి హృదయపూర్వకంగా అభినందనలు తెలుపుతున్నాను. పదవీ విరమణ సాంకే తికమే, జీవిత సాఫల్యం కొరకు అనేక మార్గాలుంటాయి. ఆ మార్గాలను ఎన్నుకునే శక్తి ఆయనకు ఉంటుంది.

వ్యాస రచయిత సీపీఐ జాతీయ కార్యదర్శి

జీవ ఇంధనాలను ప్రోత్సహిద్దాం

ఐ.ప్రసాదరావు

ఖనిజేతర ఇంధనాల వాడకాన్ని ప్రోత్సహించటం, జీవ ఇంధనాలపై ప్రజలకు అవగాహన పెంపొందించే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 10వ తేదీన "ప్రపంచ జీవ ఇంధనాల దినోత్సవం" జరుపుకుంటారు. పారిస్ ఒప్పందాన్ని, ఇటీవల గ్లాస్గోలో జరిగిన కాప్ 26 సమావేశ తీర్మానం గౌరవిస్తూ మనదేశం జీవ, ఇంధనాల వాడకాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 2015 నుంచి కేంద్ర పెట్రోలియం సహజ వనరులు శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జీవ ఇంధనాల దినోత్సవం జరుపుతూ కొన్ని లక్ష్యాల సాధనకు ముందుకు సాగుతోంది. వీటిలో ముఖ్యంగా 2022 నాటికి పెట్రోల్‌లో 10% ఇథనాల్ వాడాలని, 2030 నాటికి 20% వాడాలని నిర్ధారించారు. అంతే కాకుండా జీవ ఇంధనాలు ఇథనాల్, బయో డీజిల్, బయోగ్యాస్ ఉత్పత్తి పెంచి, గ్రామ స్థాయి నుంచి వినియోగం పెంచాలని కృషి చేస్తున్నారు అని తెలిపారు. దీని ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు అనేక లక్షల విదేశీ మారక ద్రవ్యం కలిసి వస్తుంది. దీనికి అనుగుణంగా 10 వేల కోట్లతో 12 నూతన ఆధునిక రిఫై నరీలు ఏర్పాటు చేసి, సుమారు 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలి అని ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ప్రైవేటు రంగంలో నుమాలీ గఢ్ రిఫైనరీ వెదురు వ్యర్థాలతో ఇంధన తయారీకి 950 కోట్ల పెట్టుబడులతో, ప్రజ్ ఇండస్ట్రీస్ 3000 కోట్లతో జీవ ఇంధన ప్రాజెక్టు, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు 5000 వేల కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు ఏర్పాటు చేసి, జీవ ఇంధనాల ఉత్పత్తికి సమాయత్తం అవుతున్నారు. ఈలోగా వాడేసిన వంట నూనెలు, జంతు కొవ్వులు, వంటకు పనికి రాని నూనెలు 0.001% పాళ్ళలో డీజిల్‌తో కలుపుతున్నారు. ప్రభు త్వాలు ఒక వైపు ఇథనాల్ అభివృద్ధికి పాటుపడుతూ మరో పక్క గృహ అవసరాలకు ఇథనాల్‌పై దృష్టి సారించింది. మన దేశంలో 2015–16లో 1.1 కోట్ల లీటర్ల బయోడీసిల్ సముపార్జన చేయగా, 2019–20 నాటికి 10.56 కోట్లకు పెరి గింది. భారత్‌లో "ఇయామి ఆగ్రోటెక్ లిమిటెడ్" అతిపెద్ద బయోడీసిల్ ఉత్పత్తి చేసే సంస్థ. 2021 డిసెంబర్ నాటికి 25,000 వేల కోట్ల బయోడీసెల్ ఉత్పత్తి చేసింది. మన దేశంలో 6 రకాల వృక్షాలు ప్రతీ సంవత్సరం 650 మిలియన్ల లీటర్ల బయోడీసిల్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్నా, కేవలం నేడు 280 మిలియన్ల బయోడీసిల్ ఉత్పత్తి చేయగలుగుతున్నాం. కనీసం 2030 నాటికి 8.60 శాతం వాహనాలు బయోడీసెల్‌తో నడపాలని యోచిస్తున్నారు. ఈ విధంగా ప్రస్తుతం ప్రపంచంలో 0.7% మాత్రమే అన్ని దేశాల్లో బయోడీసెల్ వాడుతూ ఉండగా, మనదేశంలో కేవలం 0.2% శాతం మాత్రమే వాడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బయోడీసెల్ వాడకంలో టాప్ ఫైవ్ దేశాలు ఇండోనేషియా, అమెరికా, బ్రెజిల్, జర్మనీ, అర్జెం టీనా, ఇండోనేషియా 137.86 వేల బ్యారెల్ వాడకంతో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. పర్యావరణం కాపాడడానికి, భూతాపం తగ్గించడానికి, శిలాజ ఇంధనాలు వాడకం తగ్గించడానికి ఈ బయోడీసెల్ వాడకం పెరగడమే ప్రత్యామ్నాయం.

వ్యాస రచయిత సెల్ 9948272919

సంక్షేమంతోనే అభివృద్ధి

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

సంక్షేమం, అభివృద్ధి ఒకదానికొకటి పోటీ కాదు. అవి పరస్పరాధారితాలు. సంపూరకాలు. సంక్షేమం అభివృద్ధికి దారితీస్తుంది. సంక్షేమం సుస్థి రమై అభివృద్ధి పరిపూర్ణమైతే, సంక్షేమ పథకాల అవ సరముండదు. సంక్షేమ పథకాలు సామాన్యుల ప్రయోజనాలకు ఉపయోగపడాలి. సంపన్నుల, కార్పొరేట్ల అభివృద్ధికి అనువర్తించేటట్లు వాటిని రూపొందించటం రాజ్యాంగ విరుద్ధం. ప్రజాద్రోహం.

ప్రజలకు కూడు, గూడు, గుడ్డ వంటి ప్రాథమిక అవసరాలు తీర్చడం, విద్యవైద్య సౌకర్యాలు అందించడం, పౌరుల ఆర్థిక, సామాజిక స్థితి క్షీణించకుండా కాపాడటమే గాక మెరుగుపరచటం, ఉన్నతీకరిం చటం ప్రజా సంక్షేమం. పెట్టుబడిదారుల లాభాల సౌకర్యాలు, సంపన్నుల సుఖ సంతోషాల, సౌకర్య విలాసాల భవంతులు, క్రీడలు, భోజన మధురాసక్రీడల ప్రాంగణాలు అభివృద్ధి కాదు. పేదలకు ఉపాధి కల్పించి, కనీస విరామ వినోదా లను అందించే సమ్మిళిత సమగ్ర ప్రగతియే అభివృద్ధి. ఇందులో ధనికవర్గ ఆది పత్యం, పేదల దోపిడీ ఉండవు. సంక్షేమం రెండు పాలనా పద్ధతుల్లో అమలవు తుంది. 1.సంక్షేమ పెట్టుబడిదారీ విధానం: ఇది వాణిజ్యవేత్తల అనుకూల విధా నాలు పాటిస్తుంది. ప్రభుత్వ రంగం కంటే ప్రైవేటు రంగం అతి ప్రభావ వంతంగా సాంఘిక సంక్షేమం అందిస్తుందని నమ్ముతుంది. 2. సంక్షేమ రాజ్యం: ఇందులో పౌరుల ఆర్థిక, సామాజిక సంక్షేమం ప్రభుత్వ బాధ్యత. సంక్షేమం ప్రభుత్వ అధీనంలో ఉంటుంది. పథకాల అమలులో కార్మిక సంఘాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇందులో 3రకాలు. ఉదారవాద, సామ్య వాద ప్రజాస్వామ్య, సంప్రదాయవాద సంక్షేమ రాజ్యాలు. వీటి లక్షణాలు వేరు.

రోమన్ సామ్రాజ్యం ప్రజల అవసరాలను రాజ్యం తీర్చేది. 1917 సోషలిస్టు విప్లవం తర్వాత సమసమాజ స్థాపన దిశలో సోవియట్‌లో సంక్షేమ రాజ్యం అమల్లోకి వచ్చింది. రైతుల, శ్రామికవర్గ సంక్షేమం ప్రాధాన్యత సంతరించు కుంది. స్త్రీలకు సమాన హక్కులు ఇచ్చారు. బాలల వికాసానికి పెద్దపీట వేశారు. అమెరికా ఐరోపా దేశాల్లో ఘోర ఆర్థిక మాంద్యంలో పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడటానికి సంక్షేమ చర్యలు చేపట్టారు. అమెరికాలో1929–46 మధ్య పేదలకు, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలయ్యాయి. అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ 1933–39 మధ్య న్యూ డీల్ పేరుతో సంక్షేమ పథకాలను ధారా వాహికంగా అమలుచేశారు. ప్రజలకు పనులు కల్పించారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేశారు. పేదల ఆకలి తీరింది. రైతులకు, నిరుద్యోగులకు ఊరట సామాజిక భద్రత లభించాయి. అమెరికా దళారీ మార్కెట్ వాల్‌స్ట్రీట్ సంస్క రణలు అమలయ్యాయి. పెట్టుబడిదారీ పాలన నిలబడింది. ఇంగ్లండ్‌లో పెట్టు బడిదారీ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ పెట్టుబడిదారీ వాణిజ్య చట్రాల ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టారు. అవి కీన్సియనిజం పేరుతో ఖ్యాతిగాంచాయి. ప్రజ లకు పనులు కల్పించారు. ఆర్థిక సహాయం అందించారు. పన్నులు తగ్గించారు. కార్పొరేట్ ఖర్చులకు అనుబంధంగా ప్రభుత్వ ఖర్చులు పెంచారు. నిరుద్యోగ భృతి చెల్లించారు. బీమా పథకాలు అమలు చేశారు. బ్రిటిష్ ఆర్థికవేత్త, ఉదార వాద రాజకీయ సంఘ సంస్కర్త విలియం బెవెరిడ్జ్ నివేదిక సంక్షేమ రాజ్య స్థాప నకు దారితీసింది. 1940–70 మధ్య రాజ్యం ధార్మిక సంస్థల నుండి, చర్చి నుండి ప్రజాసేవలను తీసుకుంది. ఇవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థను కూలి పోకుండా ఉంచడానికే. ప్రజల సూత్రబద్ధ సంక్షేమానికి కాదు. స్కాండినేవియన్ దేశాల్లో తొలినాటి కమ్యూనిస్టు, సోషల్ డెమొక్రాటిక్ ప్రభుత్వాలు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేశాయి. నేటి మధ్యేమార్గ ప్రభుత్వాలు వాటి రద్దుకు సాహసించలేకున్నాయి. ఇంకా మెరుగుపర్చి కొనసాగిస్తున్నాయి. విద్య వైద్యం ప్రభుత్వ అధీనంలో ఉచితంగా అందుతున్నాయి. నిరుద్యోగ భృతి, వృద్ధాప్య పెన్షన్లు, ఆహార సామాజిక భద్రతలు హామీ కల్పించారు.

భారత్‌లో రాజ్యాంగ పీఠిక, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు సంక్షే మ రాజ్య హామీనిచ్చాయి. రాజ్యాంగ అధికరణ 38 సమాన అవకాశాలను, అధి కరణ14 సమాన పనికి సమాన వేతనంతో సహా అనేక సమానత్వ సూత్రాలను అందించాయి. ఆదేశిక సూత్రాలు రాజకీయ ప్రజాస్వామ్యాన్నేగాక సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని, పోలీసు రాజ్యం బదులుగా సంక్షేమ రాజ్యాన్ని ఆదేశిం చాయి. గత ప్రభుత్వాలు కొంత, నేటి సర్కారు పూర్తిగా ఈ అవగాహనలను తారుమారు చేసింది. నేటి సర్కారు సంక్షేమ పెట్టుబడిదారీ విధాన సంప్రదాయ వాద సంక్షేమరాజ్యం. సంప్రదాయవాద పాలక పక్షాలు ఎన్నికల ప్రణాళికల్లో, ప్రచారాల్లో అర్థంలేని, ఆచరణ సాధ్యంకాని అశాస్త్రీయ, అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధ వాగ్దానాలు చేస్తున్నాయి. సంక్షేమం పేరుతో అపాయకర జన సమీకరణ, ఓటు బ్యాంకు రాజకీయాలుచేస్తున్నాయి. గద్దెనెక్కి ఎక్కువ ప్రమా ణాలను విస్మరిస్తున్నాయి. కొన్నిటిని అమలు చేసి అభాసు పాలవుతున్నాయి. ఈ అతిశయ, అతిక్రియాశీల, అవాంఛిత సంక్షేమాల, ప్రజల ఇష్టానిష్టాలతో సంబం ధంలేని సంక్షేమ రాజ్యాన్ని గేలి చేస్తున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు లబ్ధి పొందాలి. వాటి పాదార్థిక, సామాజిక ప్రయోజనం సామాన్య ప్రజలకు అందాలి. అభివృద్ధికి దారితీయాలి. ప్రైవేటు సంస్థలకు, కార్పొరేట్లకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు, లాభాలు అందరాదు. సంక్షేమ పునాదులైన విద్య, వైద్యం తప్పనిసరిగా ప్రభుత్వ అధీనంలోనే ఉండాలి. ప్రపంచీకరణను ఆమో దించి ఈ రంగాలను ప్రైవేట్లకు అప్పజెప్పారు. ప్రభుత్వ రంగంలో మిగిలిన ఈ రంగాల సేవలను మెరుగుపర్చాలి. అధికార, ఉద్యోగ శ్రమ సంస్కృతిని ఉన్నతీ కరించుకోవాలి. ఉచిత నైపుణ్య

పేదలకు సంక్షేమం అవసరం

సేవలను కాదని ప్రజలు లక్షల ఖర్చుతో కార్పొ రేట్ల కబందాల్లోకి వెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా, పరో క్షంగా విద్య వైద్య సేవారంగాల్లో ప్రవేశించారు. కార్పొరేట్ల కొమ్ముకాస్తున్నారు. దోపిడీ సాగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పనులు వీళ్ళే పొందుతారు. పేదల సంక్షేమం మరుగునపడింది. కార్పొరేట్లు అభివృద్ధి చెందుతున్నారు. ఈ ప్రక్రియ అన్ని రంగాలకు విస్తరించింది. ప్రధాని బీమా పథకాలు ప్రైవేటు సంస్థలను బతి కించేవే. ఆరోగ్యశ్రీలో కార్పొరేట్ల ఆస్పత్రులు, ఫీజు రియంబర్స్మెంటు కార్పొరేట్ల కళాశాలలు లాభపడ్డాయి. ఈ ఖర్చుతో ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగు పర్చవచ్చు. ప్రభుత్వ కళాశాలలు స్థాపించవచ్చు. అందరికీ ఉచిత విద్య వైద్యం అందించవచ్చు. దీర్ఘకాల నష్టాలు గమనించక, తాత్కాలిక భృతులతో తృప్తిపడిన అమాయక ప్రజలు పాలకవర్గ ఓటు బ్యాంకుగా మారారు. పాలకులకు ఈ పథ కాలతో అపరిమిత ప్రయోజనాలున్నాయి. అధికారులు, దళారీలు లాభపడతారు. ప్రైవేటర్లు, కార్పొరేట్లతో శాశ్వత 'నీకిది నాకది (క్విడ్ ప్రొ కొ)' బంధం ఏర్పడు తుంది. జీవితమంతా పరస్పర లబ్ధి పొందుతూ ఉంటారు. సంక్షేమం పేరుతో పన్ను చెల్లింపుదారుల సొమ్ము కార్పొరేట్ల వశమవుతోంది. ఆ ఆర్థికబలంతో వాళ్ళు మరిన్ని సంస్థలు స్థాపిస్తారు. సమాజ వినాశకులను తయారుచేస్తారు. దేశ విచ్ఛిన్నతకు దారితీస్తారు. సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రజలకు అవగాహన లేదు. దోపిడీ వర్గాల ప్రాయోజిత ప్రణాళికలను పాలకులు పేదల సంక్షేమ పథకాలుగా వర్ణిస్తారు. ఈ మోసపూరిత ప్రచారాలను ప్రజలు నమ్ముతారు. అరకొర సౌకర్యాలతో తృప్తిపడతారు. ఈ మోసాలను వివరించేవారు తమ సౌకర్యాలకు అడ్డుపడుతున్నారని భావిస్తారు.

సంపూర్ణ అభివృద్ధి సాధించే వరకు సంక్షేమం కొనసాగవలసిందే. నేడు పాలక పార్టీలు, వాటి మిత్ర పక్షాలే గాక ప్రతిపక్షాలు కూడా సౌజన్య పక్షపాతం (జౌనంటే జౌననే ఎదురుచెప్పలేని తత్వం)తో ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కార్పొ రేట్లకు ప్రయోజనాలు కల్పిస్తున్నాయి. స్వలాభం చూసుకుంటున్నాయి. ప్రజా సంక్షేమానికి తూట్లుపొడిచి అభివృద్ధి నిరోధకాలుగా మారుతున్నాయి. ప్రగతిశీల పౌరసంఘాలు, ప్రత్యామ్నాయ పక్షాల ప్రజాసంఘాలు సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు అవగాహనకల్పించాలి.

వ్యాస రచయిత ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, 9490204545

ఐ-మెయిల్

వృద్ధులను కనికరించండి

సామాన్య ప్రజలు దూర ప్రయాణం చేయాలంటే ఏకైక మార్గం రైలు ప్రయాణం మాత్రమే అందుబాటులో ఉంది. కొంత మందికి బస్ ప్రయాణం పడని వారు కూడా రైల్ ప్రయాణం చేస్తుంటారు. కానీ రైల్వే స్టేషన్‌లలో వృద్ధులు, వికలాంగులు ప్లాట్ ఫారం మారేందుకు కొన్ని రైల్వే స్టేషన్లలో లిఫ్ట్ సౌకర్యం ఉంది. కానీ అవి స్టేషన్ రద్దీగా ఉన్న సమయాల్లో పని చేయుట లేదు. వీల్ చైర్ కొరకు స్టేషన్ మాస్టర్లను సంప్రదిస్తే

వారు సరి అయిన సమాధానం చెప్పటం లేదు. చివరకు రైల్వే కూలీలను సంప్రదిస్తే ప్రకటించిన చార్జీల కన్నా ఎక్కువ డిమాండ్ చేయడం జరుగుతుంది. ఒక్కొక్క సారి రైల్వే టికెట్ ధర కన్నా ఎక్కువ ఈ వీల్ చైర్ కు చెల్లించవలసి వస్తుంది. దేశానికి స్వాతంత్రం వచ్చి డెబ్బై ఐదు సంవత్సరాలు గడిచి "ఆజాద్ అమృ తోత్సవ్" జరుపుతున్న సమయాల్లో వృద్ధుల పట్ల రైల్వే వారు దయ తలచి వృద్ధులు, వికలాంగులు ప్రశాంతంగా ప్రయాణం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. అలాగే వృద్ధులకు రైల్ ప్రయాణంలో కోవిడ్ సమయంలో రద్దు చేసిన రాయితీలు పునరుద్ధించాలి

ఆళవందార్ వేణు మాధవ్

పలస్తీనా స్వేచ్ఛా స్వాతంత్రాలకై ఐక్యమవుదాం



బుడ్డిగ జమిందార్

పలస్తీనా ప్రాంతం గాజాస్ట్రిప్‌పై గత నాల్గురోజుల నుండి ఎడతెరపి లేకుండా ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తూనే ఉంది. చిన్నారులను సైతం లెక్కచేయక, పౌరులను, పలస్తీనా, ఇస్లామిక్, జిహాద్ నాయకులను చంపుతూ ప్రజల ఆస్తులను విధ్వంసం చేస్తున్నది. 2021 మే నెలలో 11 రోజుల పాటు యుద్ధం చేసి వందలాది పలస్తీనియన్లను చంపటంతో పాటు అనేక వేలాదిమందిని క్షతగాత్రుల్ని చేసింది. కొద్ది విరామం తర్వాత అన్నట్లు తిరిగి జాత్యహంకార ఇజ్రాయిల్ పల స్తీనాను అంతమొందించే వ్యూహంలో భాగంగానే ఈ క్షిపణుల దాడుల్ని చేస్తుంది. ఉక్రెయిన్, తైవాన్‌ల కోసం మొసలి కన్నీరు కార్చిన అమెరికా, మిత్ర దేశాలకు పల స్తీనా ప్రజల మానవ హక్కులు, స్వేచ్ఛాస్వాతంత్రాలు గుర్తుకు రావటం లేదు. ఈ నాల్గురోజుల వరస కాల్పుల్లో 15 మంది చిన్నారుల్ని ఇజ్రాయిల్ బలి తీసుకొంది. దీంతోపాటుగా మరో 29 మంది పౌరుల్ని ఇజ్రాయిల్ చంపింది. "ఉగ్రవాద బెది రింపులకు వ్యతిరేకంగా తన ప్రజలను రక్షించటానికి ఇజ్రాయిల్ హక్కు'కు మద్దతు నిస్తామని ఐరాసలో అమెరికా రాయబారి లిండా థామస్ చెప్పటమంత మరో ఘోర మైన ప్రకటన ఉండదు. 15 మంది చిన్నారులు జామిల్ (4 సంవత్సరాలు), అలా (5), మోమెన్ (5), సాలెమ్ (9), సైరాబ్ (11), నజీమ్ 13), నబాహీన్ (13), హసౌనా (14), హామెద్ (16), ఫార్రామ్ (16), హనూడా (18 సంవత్సరాలు) అమెరికా పచ్చకామెర్ల యుద్ధ కళ్ళకు టెర్రరిస్టులగానే కనబడుతున్నారు. చనిపోయిన చిన్నారులను చూస్తుంటే గుండె తరుక్కుపోతుండగా వాళ్ళని ఉగ్రవాదులుగా పోల్చటం సామ్రాజ్యవాద నీచ సంస్కృతి చరిత్రలో నిలిచిపోతుంది. అమెరికన్ కార్పొ రేట్ మీడియా, సి.ఐ.ఏ ఉక్రెయిన్‌లో పిల్లల మరణాలకు నమ్మకమైన ప్రజా సేవ కులుగా ప్రచారంతో రోజూ మీడియా ప్రచారం చేసేది. పిల్లల మరణాల్ని ఎక్కడైనా ఖండించవల్సిందే. కానీ పలస్తీనా చిన్నారుల మరణానికి పెదవి కదపటం లేదు. అమాయకుల ప్రాణాలు కోల్పోయినందుకు సంతాపం వ్యక్తపర్చలేదు. ఇజ్రాయిల్‌ను హంతకునిగా, తాత్కాలిక ప్రధానమంత్రి లాపిడ్, రక్షణమంత్రి బెన్నీగాంచ్‌లను హంతకులుగా ఎందుకు చిత్రీకరించటం లేదు. ఇజ్రాయిల్ మిలిటరీని అమెరికా ఎందుకు వెనకేసుకొస్తుంది అనే అమెరికా ద్వంద్వ నీతిని ప్రజలు ప్రశ్నించకమానరు. పలస్తీనీయన్లు కోరేది వాళ్ళ దేశాన్ని వాళ్ళకి ఇమ్మంటున్నారు. అప్పటివరకూ వారికి కేటాయించిన భూభాగాల్నయినా ఇమ్మంటున్నారు. ఇజ్రాయిల్ ఆక్రమణను వ్యతి రేకిస్తున్నారు. తూర్పు జెరూసలేం వెనుక్కి ఇమ్మంటున్నారు. అన్ని దేశాల పౌరుల్లా వారికీ చదువుకొనే హక్కు, తాగునీరు, ఆహారం, ఉంటానికి ఇల్లు, స్వేచ్ఛాయుత జీవితం కావాలంటున్నారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పలస్తీనా భూభాగాన్ని ఆక్రమించిన ఇజ్రాయిల్ కనీసం ఐరాస నిబంధనలకైనా కట్టుబడి ఉండమంటుంటే ఇజ్రాయిల్‌కు మద్దతు యిస్తున్న అమెరికా ప్రతీ సంవత్సరం 3 నుండి 6 బిలియన్ల డాలర్ల ప్రత్యక్షంగా నిధులను యిస్తుంది.

ఇజ్రాయిల్ సైన్యానికి బలైన పలస్తీనా చిన్నారులు

2000 నుండి కనీసం 2,200 మంది చిన్నపిల్లల్ని ఇజ్రాయిల్ మిలిటరీ చంపిం దని ది డిఫెన్స్ ఫర్ చిల్డ్రన్ ఇంటర్నేషనల్ వివరాలను విడుదల చేసింది. రెండవ ఇంట్ఫాడా 2000వ సంవత్సరంలో ప్రారంభమైంది. గాజా ప్రాంతంలో 23 లక్షల పలస్తీనియన్లు నివసిస్తున్నారు. 2005 నుండి గాజాస్ట్రిప్ నుండి ఇజ్రాయిల్ వైదొలి గింది. కానీ అటు పిమ్మట నుండి గాజా భూభాగాన్ని ఆక్రమిస్తూ ఇజ్రాయిల్ సైనిక దళాలు అమాయక పలస్తీనియన్లపై దాడుల పర్వాల్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ దాడుల కాలక్రమాన్ని అల్‌జజీర్ పత్రిక విడుదల చేసింది. 1) ఆగస్టు 2005 – ఈజిప్టు నుండి గాజాస్ట్రిప్‌ను స్వాధీనపర్చుకొన్న ఇజ్రాయిల్ 38 సంవత్సరాల తర్వాత స్థావరాల్ని విడిచిపెట్టి వైదొలగింది. 2) 2006 – హమాస్ సాయుధ సమూహం 2006 పలస్తీనా ఎన్నికల్లో మెజారిటీ సీట్లను గెల్చుకొంది. 3) 2006లో గాజా సరి హద్దులపై ఇజ్రాయిల్ దాడుల్ని చేసింది. 4) డిసెంబరు 2008లో 22 రోజుల సైనిక దాడిని ఇజ్రాయిల్ ప్రారంభించి, కాల్పుల విరమణ ఒప్పందానికి ముందే 1400 మంది పాలస్తీనియన్లను చంపింది. ఈ కాల్పుల్లో కేవలం 13 మంది ఇజ్రాయిల్ సైనికులు మాత్రమే చనిపోయారు. 5) 2012 హమాస్ స్టాఫ్ చీఫ్ అహ్మద్ జఫారీని ఇజ్రాయిల్ చంపింది. 6) 2014లో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 2100 పల స్తీనియన్లు చనిపోగా 73 మంది ప్రాణాల్ని ఇజ్రాయిల్ కోల్పోగా అందులో 73 మంది సైనికులే ఉండడం గమనార్హం. 7) 2018లో గాజా ఫెన్సింగ్ సరిహద్దు వద్ద జరిపిన నిరసనల్లో 170 మంది పలస్తీనియన్ల ప్రాణాల్ని ఇజ్రాయిల్ బలిగొంది. ఈ నిరసనలు అనేక నెలలు జరిగాయి. 8)2021 మే నెలలో పవిత్ర రంజాన్ మాసంలో అల్ అక్సా మసీదు వద్ద ప్రార్థనలు చేసుకొంటున్న పలస్తీనియన్లపై ఇజ్రా యిల్ దాడులు జరిపింది. కనీసం 260 మంది పలస్తీనీయన్లు మరణించారు. ఈ దాడులు వరుసగా 11రోజులు జరిగాయి. 13మంది ఇజ్రాయిల్ సేనలు చనిపోయారు.

23 లక్షల ప్రజానీకంతో ఉన్న గాజాస్ట్రిప్‌లో సగం మంది నిరుద్యోగంతో ఉన్నారు. వైశాల్యం 365 చదరపు కిలోమీటర్లు ఉంది, 64 శాతం ప్రజానీకం ఆకలితో అలమటిస్తున్నారు. పలస్తీనా భూభాగాలైన గాజాస్ట్రిప్, వెస్ట్‌బ్యాంకులను ప్రపంచ బహిరంగ కారాగారాలుగా ఇజ్రాయిల్ తయారు చేసింది. ఒక వైపు మధ్య ప్రాచ్యంలో అత్యంత శక్తివంతమైన ఇజ్రాయిల్ దేశం మిలిటరీ అమెరికా సామ్రాజ్య వాదం చేత దేశమంతా ఆయుధాల్ని ఉంచి, రక్షణ లేని పలస్తీనా దారిద్ర్య దేశంపై బాంబుల వర్షం కురిపిస్తూ 'ఇరుదేశాల భయంకరమైన సరిహద్దు పోరాటాన్ని తాత్కాలికంగా కాల్పుల విరమణతో ముగించినట్లు "పాశ్చాత్య మీడియా రాసినా ఇజ్రాయిల్‌కు పలస్తీనాకు పోటీ ఎక్కడ? పలస్తీనియన్లు స్వీయరక్షణకు తయారుచేసే ఆయుధాలు దీపావళి టపాకాయలు వంటివి. ఇజ్రాయిల్ డ్రోన్లు, ఎఫ్–35లు, క్షిపణుల వ్యవస్థ ముందు పలస్తీనా ఎంత? పలస్తీనాను టెర్రరిస్టు దేశంగా పోల్చ టానికి, స్వంత దేశంలో స్వేచ్ఛా స్వాతంత్రాలు కావాలని కోరుకోటాన్ని సామ్రాజ్య వాదం అడ్డుకోవటం సిగ్గుచేటు. అమెరికాలో 3 శాతం కూడా లేని యూదులు దేశ సంపదలో 24 శాతం కల్గి ఉన్నారు. ఏ అమెరికా ప్రెసిడెంటుకైనా వారి అండ కావాలి. కనుకనే బైడెన్ ఇటీవల తన మొదటి విదేశీ పర్యటనల్లో ఇజ్రాయిల్‌కు ప్రాధాన్యతనిచ్చారు. ఇజ్రాయిల్, అమెరికాలు చేసే పాపాలకు అండగా 'ఐఒయు 2' పేరిట ఒక కూటమిని ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చాడు. ఈ ఐ2 (ఇండియా+ఇజ్రాయిల్) యు2 (యుఎస్ఎ+యునైటెడ్ ఎమిరేట్స్) ప్రణాళికకు మన కేంద్ర ప్రభుత్వం మద్దతు పలకటం, పలస్తీనాను వదిలి మన ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయిల్ పర్యటించడం ఆహ్వానించటం జాతులను మతాలను ఏరి పారేయాలనే ఇజ్రాయిల్ నుండి మనదేశం ఏమి నేర్చుకోనుంది అని భారతీయులు కూడా అడుగుతున్నారు. పలస్తీనా సమస్యకు పరిష్కారం లభ్యం కానంతవరకూ మధ్య ప్రాచ్యంలో శాంతి లేనట్లే, గాజాస్ట్రిప్, వెస్ట్‌బ్యాంకుల్లో ఇజ్రాయిల్ శాశ్వత కట్టడాలు తీసి, కృత్రిమ సరిహద్దు గోడల్ని నిర్మూలించాలి. జెరూసలెంను ప్రత్యేక ప్రతిపత్తి గల నగరంగా ఐరాస కట్టడిలో ఉంచాలి. భవిష్యత్తు పలస్తీనాకు తూర్పు జెరూసలేంను కేటాయించాలి. అక్కడ నుండి అమెరికా రాయబార కార్యాలయాల్ని ఎత్తేయాలి. అప్పుడుగానీ మధ్యప్రాచ్యంలో శాంతి విరాజిల్లదు. పలస్తీనాకు సంఘీభావాన్ని ప్రకటిద్దాం.

వ్యాస రచయిత ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు

ఉచితాలతో ఆర్థిక ప్రభావం అంచనా ముఖ్యం: సుప్రీం

న్యూఢిల్లీ: ఉచితంగా ఏదైనా ఇచ్చే ముందు దాని వల్ల ఆర్థికపరమైన ప్రభావం ఏ మేరకు ఉంటుందన్న అంచనా వేయడం చాలా ముఖ్యమని సర్వోన్నత న్యాయస్థానం చెప్పింది. రాజకీయ పార్టీలు ఉచితాలను ఇష్టమొచ్చినట్లు ప్రకటిస్తుండటం, అందుకోసం అవసరమైన బడ్జెట్ నిర్వహణ లేకపోవడం వంటి అంశాలతో నిపుణుల కమిటీ ఏర్పాటును కోరుతూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిల్‌ను సుప్రీం కోర్టు విచారించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా వాదనలు వినిపించారు. సరైన ఆర్థిక, బడ్జెట్ నిర్వహణ లేకుండా రాష్ట్రాలు అందించే ఉచితాల వల్ల దీర్ఘకాలిక ప్రభావం ఉంటుందని దేశంలోని రెండు అత్యున్నత ఆర్థిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేయడాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కేంద్రం ఇచ్చే రుణం తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి కాబట్టి 'సిస్టమ్ ఆఫ్ క్రెడిట్ రేటింగ్'ను ప్రవేశపెట్టి రుణాలను కట్టడి చేయాలని పిటిషన్ పేర్కొంది. వాదనల అనంతరం ఉచితాలను ఇచ్చే ముందు వాటి వల్ల ఆర్థిక వ్యవస్థపై ఏ మేరకు ప్రభావం ఉంటుందన్నది అంచనా వేసుకోవడం చాలా ముఖ్యమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఉచితాలపై నిపుణుల కమిటీ ఏర్పాటుకు ఇప్పటికే సూచనలు చేసింది.

పెరిగిన మోదీ ఆస్తులు

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆస్తుల విలువ రూ.2.23 కోట్లకు పెరిగింది. వాటిలో చాలా వరకు బ్యాంకు డిపాజిట్లే. కానీ గాంధీనగర్‌లో ఒక భూమిలో తన వాటాను విరాళంగా ఇచ్చేయడంతో స్థిరాస్తులు లేవని ఆయన తాజా ఆస్తుల వివరాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి తన ఆస్తుల వివరాలను బహిర్గతం చేశారు. పీఎంవో వెల్లడించిన వివరాల ప్రకారం... గత ఏడాదితో పోలిస్తే ప్రధాని ఆస్తులు రూ.26 లక్షల మేర పెరిగాయి. మొత్తం ఆయన ఆస్తుల విలువ రూ.2.23 కోట్లుగా ఉండగా, వాటిలో అధికంగా బ్యాంకు డిపాజిట్ల రూపంలోనే ఉన్నాయి. మోదీకి ఎలాంటి స్థిరాస్థులూ లేవని స్పష్టం చేసింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న కొంత నివాసయోగ్యమైన భూమిలో తన వాటాను దానంగా ఇచ్చినందున ఆయనకు స్థిరాస్తులేమీ లేవని తెలిపింది. బాండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ రూపంలో మోదీకి పెట్టుబడులు లేవని, ఆయనకు సొంత వాహనం కూడా లేదని వెల్లడించింది. కానీ ఆయనకు నాలుగు బంగారు ఉంగరాలు ఉండగా, వాటి విలువ రూ.1.73 లక్షలుగా ఉంటుందని డిక్లరేషన్‌లో పేర్కొంది. అయితే మార్చి 31, 2021 నాటిక మోదీ వద్ద ఉన్న రూ.1.1 కోట్ల విలువ చేసే ప్లాట్‌ను విరాళంగా ఇవ్వడంతో ప్రస్తుతం ఆయన వద్ద ఎలాంటి స్థిరాస్తులు లేవని పేర్కొంది. దీంతో ఈ ఏడాది మార్చి 31 నాటికి మోదీ మొత్తం ఆస్తుల విలువ రూ.2,23,82,504గా ఉన్నట్లు తెలిపింది. 2002 అక్టోబర్‌లో మోదీ గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో మరో ముగ్గురు వాటాదార్లతో కలిసి కొనుగోలు చేసిన నివాసయోగ్య భూమి (సర్వే నంబర్ 401/ఎ)లో ఒక్కొక్కరికి 25 శాతం సమాన వాటా ఉందని, దాన్నే మోదీ విరాళంగా ఇచ్చినట్లు తెలిపింది. దీంతో ప్రస్తుతం మోదీ చేతిలో రూ.35,250 నగదు, పోస్టాఫీసులో రూ.9,05,105 విలువ చేసే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లతో పాటు రూ.1,89,305 విలువ చేసే జీవిత బీమా పాలసీ ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు, ప్రధానితో పాటు తమ ఆస్తుల వివరాలు వెల్లడించిన కేబినెట్ మంత్రుల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రూ.2.54 కోట్ల విలువ చేసే చరాస్తులు ఉండగా... రూ.2.97 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. మొత్తం 29 మంది కేబినెట్ మంత్రులు ఉండగా... గత ఆర్థిక సంవత్సరంలో తమ సొంత, వారిపై ఆధారపడిన వారి ఆస్తులు ప్రకటించిన వారిలో ధర్మేంద్ర ప్రధాన్, జ్యోతిరాదిత్య సింధియా, ఆర్‌కే సింగ్, హర్‌దీప్ సింగ్ పురీ, పురుషోత్తం రూపాలా, జి.కిషన్ రెడ్డి ఉన్నారు. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో కేబినెట్ మంత్రిగాపని చేసి, గత నెలలోనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ముక్తార్ అబ్బాస్ నఖ్వీ కూడా తన ఆస్తుల వివరాలను ప్రకటించారు.

టీఎంసీ నేత అనుబ్రతకు సీబీఐ సమన్లు

కోల్‌కతా: పశువుల స్మగ్లింగ్ వ్యవహారంలో బుధవారం ఉదయం 11 గంటలకు నగరంలోని నీజాం ప్యాలెస్‌లో విచారణకు హాజరు కావాలని టీఎంసీ సీనియర్ నేత అనుబ్రతా మొండల్‌కు సీబీఐ సమన్లు జారీ అయ్యాయి. సీబీఐ అధికారులు మంగళవారం బోల్పూర్‌లోని అనుబ్రతా మొండల్ ఇంటికి వెళ్లి సమన్లు అందించారని, తనకు సమన్లు అందలేదని చెప్పేందుకు ఆయనకు అవకాశం ఉండదని ఓ అధి కారి తెలిపారు. అనుబ్రతా మొండల్ సోమవారం సీబీఐ విచార ణకు రావాల్సి ఉండగా అనారోగ్య కారణాలతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారని, దీంతో బుధవారం హాజరు కావాలని తాజా సమన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ కేసులో అనుబ్రతాకు సీబీఐ సమన్లు జారీ చేయడం ఇది పదవసారని తెలుస్తోంది.

లౌకికశక్తుల పటిష్ఠతకే మద్దతు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: లౌకికశక్తుల పటిష్ఠతకు దోహదపడేలా బీహార్‌లో బీజేపీ యేతర ప్రభుత్వం ఏదైనా మద్దతిస్తామని కాంగ్రెస్ మంగళవారం స్పష్టంచేసింది. బీజేపీతో జేడీయూ తెగతెంపులు చేసుకున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఈ వ్యాఖ్యలు చేసింది. బీహారు అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 19 మంది సభ్యుల బలం ఉంది. ఆర్‌జేడీ ఏ నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటామని, సంకీర్ణం పటిష్ఠతకు సహకరిస్తామని కాంగ్రెస్ తెలిపింది. సైద్ధాంతిక వైరుధ్యాలు ఉన్నప్పటికీ శివసేనకు మద్దతివ్వడం ద్వారా మహా వికాస్ అఘాదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ దోహదపడిందని, గతంలో మాదిరిగా నితీశ్‌కుమార్‌తో కలిసి ఉండటానికి తమకేమీ అభ్యంతరం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తారిఖ్ అన్వర్ పీటీఐతో చెప్పారు. 'మాది సైద్ధాంతిక పోరాటం. అధికారం కోసం మేము యుద్ధం చేయడం లేదు. లౌకికశక్తులను పటిష్ఠవంతం చేయడానికి దోహదపడేలా బీజేపీ ప్రభుత్వం దేనికైనా కాంగ్రెస్ మద్దతిస్తుంది' అని అన్వర్ స్పష్టంచేశారు. 'నితీశ్‌కుమార్ బీజేపీని వదిలి బయటికి వచ్చారు కాబట్టి మేము ఆయనకు మద్దతిస్తాం' అని తెలిపారు. లౌకిక, ప్రజాస్వామిక శక్తులను పటిష్ఠపరచడం, మతోన్మాద శక్తులను ఓడించడానికి అవసరమైన అన్ని చర్యలకు తాము అండగా ఉంటామని వివరించారు.

ఆరు జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రం

నాగాలాండ్‌లో గిరిజనుల ర్యాలీ

కోహిమా: ఆరు జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండు చేస్తూ నాగాలాండ్‌లోని గిరిజనులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తూర్పు నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పీఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో...రాష్ట్రంలోని ఆరు గిరిజన జిల్లాలతో 'ఫ్రాంటియర్ నాగాలాండ్' పేరుతో ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. మోన్, ట్యూన్‌సాంగ్, కిఫిరే, లాంగ్‌లెంగ్, నోక్లాక్ షామటోర్ జిల్లాలను కలిపి ప్రత్యేక రాష్ట్రం ప్రకటించాలని షామటోర్ జిల్లా, కియుసమ్ అదనపు అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. 2010 నుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండు చేస్తోన్న ఈఎన్‌పీఓ నేతలు మాట్లాడుతూ...తమ ప్రాంత అభివృద్ధిలో వెనుకబడి ఉందని పేర్కొన్నారు. విద్య, మౌలిక సదుపాయాల కల్పన కూడా లేదని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మాన్‌పాంగ్ ఫోమ్ వాపోయారు. తాము ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లాల్లో ర్యాలీలు జరిగాయని, అధికారులకు వినతి ప్రతాలు ఇచ్చిటనట్టు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రత్యేక రాష్ట్ర డిమాండుకు మద్దతుగా ఆరు జిల్లాల్లోని విద్యార్థి, వ్యాపార సంఘాలు సంఘీభావం ప్రకటించడంతో విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఈ ఆరు జిల్లాల పరిధిలో 20 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.

నైపుణ్యత కోల్పోయిన విద్యార్థులు

స్మైల్ ఫౌండేషన్ సర్వే

న్యూఢిల్లీ: కరోనా నేపథ్యంలో పాఠశాలల్ని పూర్తిగా మూసివేయడంతో విద్యార్థులు తమలోని నైపుణ్యాలను కోల్పోయినట్టు ఒక సర్వే తెలిపింది. కరోనా కాలంలో విద్యార్థులకు జరిగిన నష్టం, విద్యావ్యవస్థ పునరుద్ధరణ అనే విషయాలపై స్మైల్ ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన సర్వే వివరాలను వెల్లడించింది. దాదాపు రెండేళ్లు పాఠశాలలు మూత పడడంతో విద్యార్థుల్లో చదువు పట్ల శ్రద్ధ బాగా తగ్గిందని 58 శాతం మంది ఉపాధ్యాయులు భావిస్తున్నట్టు తెలిపింది. దేశంలోని 22 రాష్ట్రాల్లో 48 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ సర్వేలో పాల్గొన్నట్టు తెలిపింది. కరోనా అనంతరం 50 శాతం మంది పిల్లలు తమ వయసుకు తగిన రీతిలో చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారని తెలిపింది. 50 శాతం కన్నా తక్కువ మంది పిల్లలు మాత్రమే కరోనా కాలంలో తమకు జరిగిన నష్టాన్ని పూడ్చుకోగలుగుతున్నట్టు పేర్కొంది. విద్యార్థుల్లో పరధ్యానం ఎక్కువైందని 80 శాతం మంది ఉపాధ్యాయులు అభిప్రాయపడినట్టు తెలిపింది. మహమ్మారి మునుపటి పరిస్థితులు నెలకొనాలంటే కొంత సమయం పడుతుందని పేర్కొంది. ఇక తమ పిల్లల చదువుల గురించి ఉపాధ్యాయులతో మాట్లాడే తల్లిదండ్రుల సంఖ్య పెరిగినట్టు తెలిపింది. 47 శాతం మంది తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి తమ పిల్లల చదువులపై చర్చిస్తున్నట్టు పేర్కొంది. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాల్లో 27 శాతం పెరుగుదల ఉన్నట్టు తెలిపింది. కరోనా కాలంలో ఆన్‌లైన్ విద్య అందుబాటులోకి వచ్చినా అందుకు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడినట్టు చాలా మంది తల్లిదండ్రులు పేర్కొన్నట్టు తెలిపింది. కరోనా కారణంగా జరిగిన నష్టాన్ని పూడ్చడానికి విద్యార్థి ఆధారిత కార్యక్రమాల నిర్వహణ, కమ్యూనిటీ వలంటీర్లు, శిక్షామిత్ర తదితర వ్యవస్థలను సృష్టించి విద్యార్థుల అభ్యసన అవసరాలను తీర్చాలనే సిఫార్సులను సర్వే రిపోర్టులో పొందుపర్చింది.

ఇకపై సెలవులు ఇవ్వొద్దు

వయనాడ్ జిల్లా కలెక్టర్‌కు విద్యార్థి అభ్యర్థన

వయనాడ్: పాఠశాలలకు సెలవులు ప్రకటించడం వల్ల పిల్లలకు సంతోషం కలుగుతుందనేది సాధారణ నమ్మకం. అయితే, కేరళలోని ఒక విద్యాసంస్థలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని, పిల్లలందరూ సెలవులతో సంతోషంగా ఉండరని నిరూపించారు. ఎందుకంటే ఆమె ఇక్కడ జిల్లా కలెక్టర్‌ను తిరిగి సెలవులు ప్రకటించవద్దని అభ్యర్థించింది. తనను తాను సఫూరా నౌషాద్‌గా పరిచయం చేసుకున్న విద్యార్థిని ఆదివారం వయనాడ్ జిల్లా కలెక్టర్ ఎ గీతకు ఈ-మెయిల్ పంపి బుధవారం సెలవు ప్రకటించవద్దని అభ్యర్థించింది. విద్యార్థిని అభినందిస్తూ కలెక్టర్ తన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో మెయిల్ స్క్రీన్‌షాట్‌ను పంచుకోవడంతో చిన్నారి 'ప్రత్యేక' అభ్యర్థన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. '... నాలుగు రోజులు వరుసగా ఇంట్లో ఉండడం చాలా కష్టం. దయచేసి బుధవారం తరగతి నిర్వహించండి...' అని ఆ బాలిక ఈ-మెయిల్‌లో పేర్కొంది. వారాంతపు సెలవులు ముగియగా, భారీ వర్షాల కారణంగా సోమవారం కూడా ఈ జిల్లాలో విద్యాసంస్థలు పని చేయలేదు. ఇక మొహర్రం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మంగళవారం సెలవు ప్రకటించినందున, వయనాడ్‌లోని పాఠశాలలకు వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. ఇది విద్యార్థి కలెక్టర్‌కు అభ్యర్థన మెయిల్ పంపడానికి ప్రేరేపించింది. కాగా విద్యార్థినిని అభినందించిన కలెక్టర్... మన పిల్లలు తెలివైనవారని, వారి ప్రపంచం విశాలమని తెలిపారు. వారి చేతుల్లోనే ఈ దేశం, ఈ ప్రపంచం భవిష్యత్తు భద్రంగా ఉందని, ఆమె పేర్కొంటూ, విద్యార్థులే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వం, సమాజం ఈ తరం గురించి గర్వపడతాయని అన్నారు.

సెప్టెంబర్ 7 నుంచి కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర'



న్యూఢిల్లీ: సెప్టెంబరు 7న కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో యాత్ర'ను కాంగ్రెస్ ప్రారంభించనుంది. ఈ యాత్రలో సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ, అనేక మంది పార్టీ కార్యకర్తలు పాల్గొననున్నారు. 80 ఏళ్ల క్రితం ఇదే రోజున మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల తర్వాత ఈ ఉద్యమం భారతదేశ స్వాతంత్ర్యానికి దారితీసిందని ఆయన అన్నారు. 'ఈ ఏడాది సెప్టెంబర్ 7 నుంచి భారత్ జోడో యాత్రను ప్రారంభిస్తున్నట్లు మంగళవారం కాంగ్రెస్ ప్రకటించింది. రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ కార్యకర్తలు, సీనియర్ నాయకులు ఈ యాత్రలో పాల్గొంటారు. 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను గుండా 3,500 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుంది. దాదాపు 150 రోజుల్లో పూర్తి చేస్తాం' అని ఆయన తెలిపారు. 'భయం, మతోన్మాదం, దురభిమాన రాజకీయాలకు, జీవనోపాధిని నాశనం చేసే ఆర్థిక వ్యవస్థలకు ప్రత్యామ్నాయం చూపేందుకు ఈ యాత్రలో అందరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ విజ్ఞప్తి చేస్తోంది' అని పేర్కొన్నారు. కాగా భారతదేశం అంతటా ఐక్యతా సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, స్వతంత్ర భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ మొదటి దేశవ్యాప్త ప్రదర్శనగా గుర్తించడానికి ఉద్దేశించిన ప్రతిష్ఠాత్మక యాత్ర కోసం ప్రణాళిక చేయడానికి మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ సింగ్ నేతృత్వంలోని ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఇంతకుముందు తెలిపింది. కాగా కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద ఎన్నికలేతర ప్రచారం అయిన 'భారత్ జోడో యాత్ర' సమన్వయం కోసం కేంద్ర ప్రణాళికా బృందంలో దిగ్విజయ సింగ్, సచిన్ పైలట్, శశి థరూర్, రవ్‌నీత్ సింగ్ బిట్టు, కె.జె.జార్జ్, జోతి మణి, ప్రద్యుత్ బోర్డోలోయ్, జితు పట్వారీ, సలీమ్ అహ్మద్ సభ్యులుగా ఉన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్ వంటి రాష్ట్రాలు ఈ యాత్రలో పాల్గొనే అవకాశం ఉందని ప్రణాళికలో పాల్గొన్న ఇద్దరు నాయకులు తెలిపారు. ఉదయ్‌పూర్ చింతన శిబిరం (మేథోమథన సదస్సు) సమయంలో యాత్రకు సంబంధించిన ప్రణాళిక ప్రారంభమయింది.

అన్నివర్గాలను ఐక్యం చేసింది

క్విట్ ఇండియా ఉద్యమంపై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. ఈ ఉద్యమం సమాజంలోని అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చిందని తెలిపారు. 'బాపు నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, మన స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరిచిన వారందరినీ స్మరించుకుంటున్నాను' అని మోదీ ట్వీట్ చేస్తూ, దాని గురించి మాట్లాడిన తన మునుపటి ప్రసంగ క్లిప్‌ను పోస్ట్ చేశారు. 'ఆగస్టు 9 మన జాతీయ విప్లవానికి జ్వలించే చిహ్నంగా మారింది' అని గొప్ప సోషలిస్టు నాయకుడు జయప్రకాష్ నారాయణ్ చేసిన వ్యాఖ్యను కూడా మోదీ పంచుకున్నారు. 'బాపు స్ఫూర్తితో క్విట్ ఇండియా ఉద్యమంలో జేపీ, డాక్టర్ లోహియా వంటి మహానుభావులతో సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి విశేషమైన భాగస్వామ్యం జరిగింది' అని మోదీ ట్వీట్ చేశారు. బొంబాయిలో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభంలో మహాత్మా గాంధీ చిత్రాన్ని కూడా ప్రధాని పోస్టు చేశారు.

క్విట్ ఇండియా ఉద్యమం

ఐక్యతే గొప్ప బలమని గుర్తు చేస్తుంది

న్యూఢిల్లీ: క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం సంపన్న, సమ్మిళిత, శాంతియుత, సామరస్యపూర్వకమైన భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పానికి ఒక సందర్భమని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మంగళవారం అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమానికి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాయుడు చేసిన ట్వీట్‌లో, ఐక్యత మన గొప్ప బలాల్లో ఒకటి అని ఈ రోజు మనకు గుర్తు చేస్తుందని అన్నారు. 'స్వాతంత్ర్య సమరయోధుల నిస్వార్థ త్యాగాలు, అవిశ్రాంత ప్రయత్నాలను మనం గుర్తుచేసుకుంటూ, అందరినీ కలుపుకొని, సంపన్నమైన, శాంతియుతమైన, సామరస్యపూర్వకమైన భారతదేశాన్ని నిర్మించాలని సంకల్పిద్దాం' అని ఆయన పేర్కొన్నారు. అదే ఆ మహనీయులకు, మహిళలకు నిజమైన నివాళి అని ఉపరాష్ట్రపతి అన్నారు.

బంగ్లాదేశ్ మీదుగా త్రిపురకు ఇంధనం

త్వరలో ట్రయల్ రన్: ఐఓసీ

అగర్తల: బాంగ్లాదేశ్ మీదుగా త్రిపురకు ఇంధనాన్ని రవాణ జరిగేలా ఈ నెల 3న ఆ దేశంతో ఒక ఒప్పందం కుదిరిందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి రమేష్ తెలిపారు. ఈ ఒప్పందం మేరకు త్వరలోనే ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ట్రయల్ రన్‌లో మూడు ఎల్‌పీజీ ట్యాంకర్లు, ఏడు ఆయిల్ ట్యాంకర్లు బాంగ్లాదేశ్ నుంచి అసోంలోని గుహవాటీ మీదుగా త్రిపురకు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ట్రయల్ రన్ ట్యాంకర్లు నడిపే డ్రైవర్లు, సహాయకులకు అవసరమైన వీసాలను అందించాలని బాంగ్లాదేశ్ అధికారులను కోరినట్టు తెలిపారు. ఈ ట్రయల్ రన్ మార్గాలను కూడా అన్వేషించి పెట్టినట్టు తెలిపారు. వీసాలు రాగానే ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ట్రయల్ రన్ విజయవంతం అయితే అనూహ్య పరిణామాలు సంభవించిన తరుణంలో త్రిపురకు ఇంధనం సరఫరా చేయడానికి ఈ మార్గం ఉపయుక్తమవుతుందని పేర్కొన్నారు. అసోంలోని డిమా హసావో జిల్లా, బరాక్ వ్యాలీ, మిజోరాం, మణిపూర్, త్రిపురలను కలిపే ఏకైక రైలు మార్గం దెబ్బతినదంతో మేఘాలయ మీదుగా రోడ్డు మార్గంలో సరఫరా చేయాల్సి వస్తోందని చెప్పారు. ఇది ఖర్చుతో కూడినదని,ఈ మార్గంలో కొండ చెరియలు విరిగిపడే అవకాశం ఉన్న తరుణంలో ప్రత్యామ్నాయ రవాణా కోసం ఈ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు.

15న ఎంపీలో 356 మంది ఖైదీలకు విముక్తి

భోపాల్: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్రంలోని వివిధ జైళ్లలో జీవిత ఖైదు అనుభవిస్తున్న 356 మంది ఖైదీలను విడుదల చేయనున్నట్లు మధ్యప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. రాష్ట్ర హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా విలేకరులతో మాట్లాడుతూ జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జైళ్ల నుంచి విడుదల చేస్తామని చెప్పారు. ఈ 356 మంది ఖైదీలలో 75 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని కేంద్రం మార్గదర్శకాల ప్రకారం విడుదలైన వారు, అలాగే ఆగస్టు 15న రాష్ట్ర ప్రభుత్వ వార్షిక ఆచరణలో విడుదలైన వారు కూడా ఉన్నారని మంత్రి వివరించారు. అయితే అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవిస్తున్న దోషులను విడుదల చేయబోమని తెలిపారు.

గోవాలో ఆప్‌కు రాష్ట్ర పార్టీ హోదా: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో రాష్ట్ర పార్టీగా గుర్తింపు పొందడంతో పాటు అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ 'ఆప్' తాజాగా గోవాలోనూ రాష్ట్ర స్థాయి పార్టీగా గుర్తింపును పొందింది. గత ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీ పనితీరుపై సమీక్షించిన భారత ఎన్నికల కమిషన్ తమకు రాష్ట్ర పార్టీ హోదా ఇచ్చిందని కేజ్రీవాల్ మంగళవారం ట్వీట్ చేశారు. ఢిల్లీ, పంజాబ్ తర్వాత గోవాలో కూడా రాష్ట్ర పార్టీగా ఆప్ గుర్తింపు పొందిందని, ఈ మేరకు తమకు ఎన్నికల సంఘం నుంచి సమాచారం వచ్చిందని కేజ్రీవాల్ తెలిపారు. రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్ ఆర్డర్-1968 నిబంధనల ప్రకారం ఆప్‌ను రాష్ట్ర పార్టీగా గుర్తించినట్లు ఎన్నికల కమిషన్ పంపిన లేఖను ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

స్వేచ్ఛా వాణిజ్యంపై

బ్రిటన్‌తో చర్చలు వేగవంతం

న్యూఢిల్లీ: భారత్-బ్రిటన్ మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు వేగంగా జరుగుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ మంగళవారం తెలిపారు. రెండుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంపొందించడమే ఈ ఒప్పందం లక్ష్యమని పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన వ్యాపారి ఉద్యమ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. దేశీయ వ్యాపారుల సంఘం ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి సారించాలని, ఐక్యంగా పని చేయాలని ఆయన కోరారు. రికార్డు సమయంలో భారత్...యూఏఈతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసిందని, ఇప్పుడు బ్రిటన్‌తో ఆ దిశగా వేగంగా జరుగుతున్నాయని గోయల్ చెప్పారు. అటువంటి ఒప్పందాల్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ దేశాలు తమ మధ్య వర్తకం జరిగే గరిష్ఠ సంఖ్యలో వస్తువులపై కస్టమ్స్ సుంకాలను గణనీయంగా తగ్గించడం లేదా తొలగించడం చేస్తాయి. అంతేకాకుండా సదరు దేశాల మధ్య వాణిజ్యాన్ని, పెట్టుబడులను ప్రోత్సహించడానికి నిబంధనలను సులభతరం చేస్తారు. జనవరిలో, భారత్-బ్రిటన్‌లు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అధికారికంగా చర్చలు ప్రారంభించాయి. దీపావళి నాటికి చర్చలు ముగించాలని గడువు విధించారు. కెనడా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), ఇజ్రాయెల్‌తో కూడా భారత్... ఇలాంటి ఒప్పందాలపై చర్చలు జరుపుతోందని, భారత్‌తో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరపడానికి అనేక ఇతర దేశాలు ఆసక్తిని కనబరుస్తున్నాయని గోయల్ తెలిపారు. గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ), యురేషియన్ ఎకనామిక్ యూనియన్ (ఇఎఇయు), యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఎఫ్‌టిఎ) ఈ ఒప్పందాలపై చర్చలు జరపాలనుకుంటున్నాయని చెప్పారు. అయితే మరిన్ని దేశాలతో ఏకకాలంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి వాణిజ్య మంత్రిత్వ శాఖ వద్ద తగినంత వనరులు లేవని మంత్రి స్పష్టం చేశారు.

కేంద్రమంత్రి పీయూశ్ గోయల్



నితీశ్ నమ్మకద్రోహం: బీజేపీ

పాట్నా/న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు నమ్మక ద్రోహం చేశారని బీజేపీ మండిపడింది. తమతో తెగతెంపులు చేసుకోవడాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ జైశ్వాల్ తప్పుబట్టారు. నితీశ్‌కుమార్‌ను బీహార్ ప్రజలు క్షమించబోరని వ్యాఖ్యానించారు. 2020 ఎన్నికలను ఎన్‌డీఏ తరపున ఇద్దరం ఎదుర్కొన్నామని, జేడీయూ-బీజేపీకి ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రి అయినప్పటికీ తాము ఎక్కువ సీట్లు గెలిచామని, ఏమి జరిగినప్పటికీ ఈరోజు జరిగిన పరిణామంతో బీహార్ ప్రజలను, బీజేపీని నితీశ్ మోసం చేసినట్లేనని జైశ్వాల్ పేర్కొన్నారు. బీజేపీ కేంద్రమంత్రి, బీహార్ నేత గిరిరాజ్‌సింగ్ ఉదయం ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ తాము సంకీర్ణ ధర్మాన్ని పాటించామని, బీజేపీ నుంచి విడిపోవాలని నితీశ్ నిర్ణయించుకున్నారని చెప్పారు. బీజేపీకి 63 మంది ఎమ్మెల్యేలు, జేడీయూకి 36 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ నితీశ్‌నే తాము ముఖ్యమంత్రిని చేశామని తెలిపారు.

బీహార్‌లో ఎన్‌డీఏ నుంచి జేడీయూ తెగతెంపులు చేసుకోవడంపై బీజేపీ అధిష్ఠానంఆశ్చర్యం వ్యక్తంచేసింది. ఇంత హఠాత్తుగా బీజేపీ నుంచి ఎందుకు విడిపోయిందోనని అమాయకంగా ప్రశ్నించింది. అనేక అంశాలపై కొంతకాలంగా సీఎం నితీశ్‌కుమార్ అసంతృప్తి, అసహనంగా ఉన్నట్లు తెలిసినప్పటికీ బీజేపీ నాయకత్వం ఆశ్చర్యం వెలిబుచ్చింది. నితీశ్‌కుమార్ దిగివస్తారని సోమవారం వరకూ బీజేపీ నాయకులు ఎదురుచూశారు. కేంద్రకేబినెట్‌లో జేడీయూకి ప్రాధాన్యత కల్పించాలన్న డిమాండ్ తీసుకొస్తారనే భావనతో ఉన్నట్లు చెప్పుకొచ్చింది. రెండు పార్టీల మధ్య వైరుధ్యాలు మరింత పెరుగుతుండటంతో...ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి బీజేపీ సీనియర్ నేత, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆ పార్టీ అనేకసార్లు బీహార్‌కు పంపింది. కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఇటీవల పాట్నాలో పర్యటించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు తమ కూటమికి ఇబ్బందులు ఉండవని చెప్పుకొచ్చారు. అన్ని వివాదాలు సమసిపోతాయని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎన్‌డీఏ ముఖ్యమంత్రి అభ్యర్థి నితీశ్‌కుమారేనని ప్రకటించారు. బీహార్‌లో వాస్తవ పరిస్థితులేమిటంటే..ప్రభుత్వంలోనూ, రాజకీయం గానూ బీజేపీ పట్టు పెంచుకోవడానికి కుట్రలు చేస్తోంది. అంతటితో ఆగకుండా సీఎం నితీశ్‌కుమార్‌ను బలహీనపరుస్తోంది. జేడీయూ ఎమ్మెల్యేలను సైతం నితీశ్‌పై తిరుగుబాటుకు ప్రోత్సహిస్తోంది. సీఎంగా నితీశ్ చెప్పిన ఒక్క ప్రతిపాదనకు బీజేపీ నాయకత్వం సహకరించడం లేదు. రాజకీయంగా జేడీయూను తొక్కేయడానికి అనేక కుట్రలు చేస్తోంది. వీటన్నింటినీ గమనించిన నితీశ్‌కుమార్ బీజేపీతో కలిసుంటే అసలుకు మోసం వస్తుందని గ్రహించారు. చివరికి బీజేపీతో తెగతెంపులకు నిర్ణయం తీసుకున్నారు.

అసోం సీఎం శర్మపై

నాగాలాండ్ కాంగ్రెస్ మండిపాటు

కోహిమా: నాగాల రాజకీయ సమస్యలను (ప్రత్యేక జండా, రాజ్యాంగం) పరిష్కరించే అవకాశాలను అసోం సీఎం హిమంత విశ్వ శర్మ చెడగొట్టారని నాగాలాండ్ కాంగ్రెస్ ఆరోపించింది. నాగా గ్రూపులతో శాంతి చర్చలతో పరిష్కారం కనుగొనే అవకాశాలు ఉంటే ఆ సమస్యలు సంక్లిష్టమైనవని, పరిష్కారం విషయాన్ని కేంద్రానికి వదిలేయాలని చెప్పడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ... నాగాలాండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె థెరీ కోసం ప్రకటన విడుదల చేశారు. నాగాల సమస్యలపై చర్చలు జరుపుతున్న కేంద్రం అసోం సీఎంను ఎస్కార్టుగా పెట్టుకుందని పేర్కొన్నారు. నార్త్ ఈస్ట్ డెమోక్రటిక్ అలయన్స్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న శర్మ ఇలా చేయడం తగదని పేర్కొన్నారు. అసోంలోని బీజేపీ యేతర ముఖ్యమంత్రులు నాగాలాండ్‌తో స్నేహపూర్వకంగా ఉన్నారని పేర్కొన్నారు. మూడుసార్లు సీఎంగా పని చేసిన బీపీ చలిహా సైతం నాగాల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం శాంతి మిషన్‌లో కీలక పాత్ర పోషించారని చెప్పారు. నాగాలాండ్ సీఎం నీఫియు రియో తమ ప్రభుత్వానికి నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలిమ్ ఇసాక్ ముయివా సంస్థల మధ్య సమస్యల పరిష్కారానికిల సహకరించాలని హిమంత విశ్వ శర్మను కోరిన విషయం తెలిసిందే.

గవర్నర్‌తో ఘర్షణ లేదు

ఎల్‌డీఎఫ్ కన్వీనర్ జయరాజన్

తిరువనంతపురం: ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్సులపై సంతకం చేయకుండా నిరాకరించిన కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌తో ఘర్షణాత్మ కవైఖరి అవలంభించబోమని అధికార్ ఎల్‌డీఎఫ్ స్పష్టం చేసింది. వామపక్ష ప్రభుత్వం ప్రజల సంక్షోమం కోసమే పని చేస్తుందని, ప్రతి అంశాన్ని చర్చల ద్వారానే పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నట్టు ఎల్‌డీఎఫ్ కన్వీనర్ ఈపీ జయరాజన్ పేర్కొన్నారు. ప్రభుత్వం గవర్నర్ ఆమోదం కోసం పంపిన కేరళ లోకాయుక్త (సవరణ) ఆర్డినెన్స్‌పై ఆయన సంతకాలు చేయకపోవడంతో ఆర్డినెన్సు గడువు ముగియడంతో అవి రద్దయ్యాయని చెప్పారు. అయితే ఈ విషయంలో గవర్నర్‌తో విరోధం లేదని జయరాజన్ పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలో ఉన్న గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ...ఆ ఆర్డినెన్స్‌లపై సంతకం చేయనని, అందుకు కొంత సమయం కావాలని పేర్కొన్నారు. ఆర్డినెన్సుల ద్వారా పాలన మంచిదికాదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆ ఆర్డినెన్స్‌పై సంతకం చేయడానికి గవర్నర్ నిరాకరించలేదని కేరళ న్యాయ మంత్రి పి రాజీవ్ అన్నారు. తమ ప్రభుత్వం కూడా ఆర్డినెన్స్‌ల పాలనకు వ్యతిరేకమని, అయితే ఆ ఆర్డినెన్స్‌ల విషయంపై చర్చించడానిక ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు.

నేరస్తులకు అండగా సీఎం

- గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు
- మూడేళ్లలో మహిళలపై దాడులు పెరిగాయి
- జాతీయ మహిళా కమిషన్‌కు, కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాం
- మహిళా అఖిలపక్ష నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ: వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ వంటివారిపై చర్యలు తీసుకోకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరస్తులకు అండగా నిలుస్తున్నారని అఖిలపక్ష మహిళా నాయకులు ఆరోపించారు. ఎంపీ గోరంట్లమాధవ్‌పై చర్యలు తీసుకోకపోవడంతోపాటు మూడేళ్లుగా మహిళలపై అత్యాచారాలు, దాడులను నిరసిస్తూ ఏపీ మహిళా అఖిలపక్షం అధ్వర్యంలో విజయవాడ హోటల్ స్వర్ణా ప్యాలెస్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, జనసేన, లోక్‌సత్తా, వివిధ మహిళా సంఘాల నాయకులు పాల్గొని వైసీపీ పాలనలో మహిళలపై దాడులను ముక్తకంఠంతో ఖండించారు. మాధవ్ వంటి వారిపై చర్యలు తీసుకోకుండా సీఎం అండగా నిలుస్తున్నారని, దీనిపై ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం, మహిళా ఎంపీలు, జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ... ఎంపీ గోరంట్ల మాధవ్ బూతు వీడియో బాగోతం బయటపడి రోజులు గడుస్తున్నా నేటికీ చర్యలు తీసుకోకుండా ఫోరెన్సిక్ నివేదిక పేరుతో వైసీపీ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ మాట్లాడుతూ... మహిళలకు కష్టమొస్తే గన్ను కంటే ముందు జగనన్న వస్తారని చెప్పుకున్నారని, మరి ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మూడేళ్లుగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న విపక్షాలపై ముందూ వెనకా చూడకుండా అకారణంగా కేసులు పెడుతున్నారని విమర్శించారు. సొంత పార్టీ ఎమ్మెల్యే నికృష్ట వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయినా అతన్ని రక్షించడం దుర్మార్గపు చర్య కాదా? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ మహిళా నాయకురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ... ప్రజా ప్రతినిధిననే విషయం మరిచి అత్యంత జుగుప్సాకరంగా వ్యవహరించిన గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోకపోగా, అది ఆయన ప్రైవేటు వ్యవహారమని సజ్జల రామకృష్ణా రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు బొల్లినేని కీర్తి, జనసేన నాయకురాలు రావి సౌజన్య, లోక్‌సత్తా నాయకురాలు నార్ల మాలతి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించలేని, శాంతిభద్రతలను పర్యవేక్షించలేని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి అనర్హుడన్నారు.

వర్షాకాల సమావేశాలు నిరాశాజనకం

కుదించేందుకు ప్రభుత్వం హడావుడి చేసింది : కాంగ్రెస్



న్యూఢిల్లీ : పార్లమెంటు వర్షాకాల సమావేశాలు 'అత్యంత నిరుత్సాహపరిచాయి' అని కాంగ్రెస్ మంగళవారం ఆరోపించింది. ప్రతిపక్ష పార్టీలు చర్చ, బిల్లులను ఆమోదించడానికి చివరి వరకు కూర్చోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, షెడ్యూల్ చేసిన తేదీ ఆగస్టు 12 వరకు కార్యకలాపాలను నిర్వహించే ఆసక్తి ప్రభుత్వానికి లేదని తెలిపింది. ధరల పెరుగుదల, 27 మంది ఎంపీల సస్పెన్షన్, వివాదాస్పద 'రాష్ట్రపత్ని' వ్యాఖ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చర్య వంటి సమస్యలపై గత మూడు వారాలుగా నిరంతర ఆటంకాలు ఏర్పడిన తర్వాత, వర్షాకాల సమావేశాలు షెడ్యూల్ కంటే నాలుగు రోజుల ముందుగానే సోమవారం ముగిశాయి. ప్రభుత్వానికి శాసనసభ అజెండా లేదని, సమావేశాల ప్రారంభంలో 32 బిల్లులను జాబితా చేసినప్పటికీ, లోక్‌సభలో ఏడు, రాజ్యసభలో ఐదు మాత్రమే ఆమోదించగలిగిందని కాంగ్రెస్ పేర్కొంది. 'లోక్‌సభలో పార్టీ నాయకుడు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలని పట్టుబట్టిన అధికార పక్షం సభ్యులు ఒకటిన్నర రోజులపాటు కార్యకలా పాలకు అంతరాయం కలిగించడం కూడా అసాధారణం. అయితే అప్పటికే మౌఖికంగానే కాకుండా లిఖితపూర్వకంగానూ క్షమాపణ చెప్పాడు' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభలో పార్టీ చీఫ్ విప్ జైరాం రమేశ్ అన్నారు. పీఎంఎల్‌ఏపై సుప్రీం కోర్టు ఆదేశాలను సమీక్షించాలని డిమాండ్ చేయడానికి ప్రతిపక్ష పార్టీలు కలిసి రావడం 'ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా భారీ ముందడుగు' అని, 'ఈడీ అధిక చేతివాటం, ప్రజల సమస్యలపై కాంగ్రెస్ శ్రేణుల సమీకరణ' వర్షాకాల సమావేశాల్లో పార్టీకి ఒక గొప్ప ప్రయోజనం' అని అన్నారు. అలాగే ఆగస్టు 5న ఈడీకి వ్యతిరేకంగా నిరసనలు కూడా హోం మంత్రి అమిత్ షాని కూడా వెనుకడుగు వేసేలా చేశాయని చెప్పారు. ఈ వర్షాకాల సమావేశాలు 'అత్యంత నిరాశపరిచాయి' అని పేర్కొంటూ, 'బిల్లులను ఆమోదించడానికి ప్రభుత్వానికి ఉత్సాహం లేదా ఆసక్తి లేదు. సాధారణంగా విపక్షాలు సభను వాయిదా వేయాలని అంటాయి. కానీ ఈసారి సభను నడపాలన్న ఆసక్తి ప్రభుత్వానికి లేదు' అని తెలిపారు. ఆగస్టు 10, 12 తేదీల్లో చర్చలు జరిపి బిల్లులను ఆమోదించేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని, అయితే ప్రభుత్వం సమావేశాలను కుదించడంలో హడావుడి చేస్తోందన్నారు. 'ఆగస్టు 11న రక్షా బంధన్ తర్వాత తిరిగి రావడానికి బీజేపీ ఎంపీలు ఇష్టపడకపోవడమే దీనికి కారణం' అని జైరాం రమేశ్ మాట్లాడుతూ ఆగస్టు 10న సభలు నిర్వహించవచ్చని అన్నారు. సమావేశాల ప్రారంభంలో ప్రభుత్వం 32 బిల్లులను జాబితా చేసిందని, అయితే లోక్‌సభలో ఏడు, రాజ్యసభలో ఐదు మాత్రమే ఆమోదించగలిగిందని తెలిపారు. 'ప్రభుత్వానికి దాని అజెండాలో ఎటువంటి పని లేదు. సభా నిర్వహణ సరిగా లేదు. గతంలో పార్లమెంటును ప్రధాని పట్టించుకునే వారు కాదు. ఇప్పుడు మంత్రులు కూడా అలాగే వ్యవహరిస్తున్నారు' అని రమేశ్ ఆరోపించారు. సోమవారం రాజ్యసభలో సెంట్రల్ యూనివర్సిటీ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గైర్హాజరైన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. 'ఐటీ, కమ్యూనికేషన్ల వ్యవహారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు దానికి సమాధానమిచ్చారు' అని వివరించారు. సభ చైర్మన్ వెంకయ్య నాయుడు వీడ్కోలు సందర్భంగా సోమవారం ప్రసంగిం చినప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ మొదటిసారి రాజ్యసభలో కనిపించారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ సెలవుల గురించి ప్రభుత్వానికి ముందే తెలుసునని, దానికి అనుగుణంగా ఎందుకు ప్రణాళికలు వేయలేదని ప్రశ్నించారు. జైరాం రమేశ్ మాట్లాడుతూ ఏప్రస్తుత పార్లమెంటు భవనంలో బహుశా ఈ వర్షాకాల సమావేశాలే చివరివని అన్నారు. ఎందుకంటే 'శీతాకాల సమావేశాలు కొత్త భవనంలో జరుగుతాయని మాకు చెప్పారు' అని తెలిపారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు పోరాడతా : రాహుల్

న్యూఢిల్లీ : నూతన నియమాలు తెచ్చి గిరిజనుల హక్కుల హరణకు కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడతామని ఉద్ఘాటించారు. అంతర్జాతీయ గిరిజనుల దినోత్సవం సందర్భంగా ఆయన ట్విట్టర్ మాధ్యమంగా స్పందించారు. అంతర్జాతీయ గిరిజనుల దినోత్సవం సందర్భంగా తుది శ్వాస వరకు న్యాయం కోసం పోరాడతానని ప్రతిజ్ఞ చేస్తున్నా అని రాహుల్ అన్నారు. గిరిజనుల హక్కుల కోసం, వారి జలం, అడవి, భూమి కోసం పోరాడతామన్నారు. కొత్త నియమ నిబంధనల ద్వారా గిరిజనుల హక్కులను హరించే కుట్ర జరుగుతోందని, 'హమ్ దో హమారే దో'కు లబ్ధి చేకూర్చేందుకే ఇదంతా అని వ్యాఖ్యానించారు. క్రోని కేపిటలిస్టుల కోసం కేంద్రం పనిచేస్తోందనే క్రమంలో 'హమ్ దో హమారే దో' అని ఆయన అంటుంటారు. 'అటవీ పరిరక్షణ కొత్త నియమాలతో కోట్లాది మంది అదివాసీలు, అడవి/గిరి పుత్రులను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ఆరోపణలను పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తిరస్కరించారు.

కేరళ మహిళ సంగీత అభయన్‌కు

అంతర్జాతీయ పారిశ్రామికవేత్త అవార్డు

కొచ్చి: కేరళకు చెందిన మహిళా పారిశ్రామికవేత్త అంతర్జాతీయ అవార్డుకు ఎంపికైంది. కాసరగడ్‌కు చెందిన సంగీత అభయాన్‌కు జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ హాంకాంగ్ (జేసీఐహెచ్‌కే) ప్రపంచ మహిళా పారిశ్రామిక వేత్త అవార్డును ప్రకటించింది. సంగీత సీఈవోగా వ్యవహరిస్తున్న నిర్వహిస్తున్న ఈడబ్ల్యూఈవరల్డ్.కామ్ సంస్థ ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తోన్న కారణంగా ఆమెకు ఈ అవార్డు దక్కింది. చేనేత, హస్తకళలకు సంబంధించిన ఆమె నిర్వహిస్తున్న స్టార్టప్ సంస్థ పనితీరును పరిశీలించిన జేసీఐహెచ్‌కే ఈ అవార్డును ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా 225 మంది మహిళా పారిశ్రామిక వేత్తల నుంచి సంగీతను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. 2017 ఈడబ్ల్యూఈ వరల్డ్.కామ్‌ను స్థాపించిన సంగీత కేరళ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చేనేత, హస్తకళల్ని ప్రోత్సహిస్తూ మహిళలకు ఉద్యోగావకాశాలు, సాధికారత కల్పించేలా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ...సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మార్కెటింగ్‌లో రాణిస్తున్న తమ స్టార్టప్ కంపెనీ వృద్ధిలోకి వచ్చిందని తెలిపారు. ఖాదీ, చేనేత వస్త్రాలపై మరిన్ని ఉత్తమమైన డిజైన్‌లను తీసుకురావాలని భావిస్తున్నట్టు చెప్పారు. తమకు అంతర్జాతీయంగా కొనుగోలు ఆర్డర్‌లు వస్తున్నాయని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న మహిళలకు శిక్షణ ఇస్తూ వ్యాపారంలో రాణించేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు.

త్వరలోనే ఎస్‌ఎస్‌ఎల్‌వీ ద్వితీయ ప్రయోగం

అంతరిక్ష కమిషన్ సభ్యుడు ఏఎస్ కిరణ్ కుమార్

న్యూఢిల్లీ: చిన్న ఉపగ్రహాలను నిర్దేశిత కక్షలోకి ప్రవేశపెట్టని కారణంగా ఎస్‌ఎస్‌ఎల్‌వీ ప్రయోగం తుదితో విఫలమైన క్రమంలో ద్విత్రీయ ప్రయోగం త్వరలోనే జరగనున్నట్లు అంతరిక్ష కమిషన్ సభ్యుడు ఏఎస్ కిరణ్ కుమార్ తెలిపారు. 'ఇది వెనకడుగుగానీ పూర్తి వైఫల్యంగానీ కాదు. చివరిలో అనుకున్నట్టుగా జరగలేదు అంతే' అని ఇస్రో మాజీ చైర్మన్ కుమార్ వ్యాఖ్యానించారు. నిర్వహణ, నిర్ణయాలు కీలకం.. వాటిపైనే ప్రశ్నలు ఉన్నాయి. అయితే వారు త్వరలోనే మరో ప్రయత్నం చేయనున్నారు. ఇది వైఫల్యం కాదు ఓ పాఠం అని కుమార్ అన్నారు.

కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణకు నిరసనగా

నేడు పోస్టల్ ఉద్యోగుల సమ్మె

కేంద్రకార్మిక సంఘాల మద్దతు

న్యూఢిల్లీ: తపాలా సేవల కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణకు కేంద్రప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా బుధవారం పోస్టల్ ఉద్యోగ సంఘాలు తలపెట్టిన సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. కేంద్రప్రభుత్వ మొండివైఖరి, ప్రతీది ప్రైవేటీకరించాలనే పట్టుదల కారణంగా ప్రతి ఒక్క ప్రభుత్వరంగానికి సమ్మె బాట పట్టక తప్పడం లేదని పది కేంద్ర కార్మిక సంఘాల (సీటీయూల) ఐక్యవేదిక పేర్కొంది. పోస్టల్ శాఖలను కార్పొరేట్‌కు దారాదత్తం చేయడం, ఔట్‌సోర్సింగ్, కార్మికశక్తికి సంబంధించిన కొన్ని వర్గాల సాధారణీకరణ (కాజువలైజేషన్), తాత్కాలీకరణ (టెంపరరైజేషన్), రెగ్యులర్ ఖాళీలను భర్తీ చేయకపోవడం తదితర చర్యలను తీసుకోవడం ద్వారా నేషనల్ మోనెటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ)లోకి పెట్టడాన్ని కార్మిక సంఘాలు దుయ్యబట్టాయి. ఎయిరిండియా విక్రయంతో మొదలై ఎల్ఐసీ ఐపీఓ, రైల్వే స్టేషన్లు, విద్యుత్ (సవరణ) బిల్లు-2022, ఇప్పుడు తపాలా శాఖను కార్పొరేట్ల పరం చేసేందుకు సిద్ధమైందని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, సేవా, ఏఐసీసీటీయూ, ఎల్పీఎఫ్, యూటీయూసీ, స్వతంత్ర సమాఖ్యలు, సంఘాలు పేర్కొన్నాయి. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ఐక్యవేదిక తరపున ఈ ప్రకటనను విడుదల చేశారు. 'ప్రైవేటు కొరియర్ సేవలు మొదలైనప్పటి నుంచి తపాలా సేవల ఖరీదు పెరగడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, రోడ్డు రవాణా సంస్థల వలే ప్రైవేటు సంస్థలేవి గ్రామీణ ప్రాంతాలలో సేవలను అందించడం లేదు. అక్కడ లాభాలు ఉండవని చెబుతుంటాయి. ప్రైవేటు మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఈ ప్రభుత్వం ఏ విధంగా లాభాల్లో ఉన్న పీఎస్‌యూని నాశనం చేసిందనేందుకు బీఎస్ఎన్ఎల్ పరిస్థితే ప్రత్యక్ష ఉదాహరణ. రైల్వే ద్వారా తమ కార్గోని రోడ్డు రవాణాకు బదిలీ చేయాలని ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. అక్కడ ప్రైవేటు తిమింగిలాలు కాచుకుకూర్చున్నాయి!' అని ఐక్య వేదిక వ్యాఖ్యానించింది. తపాలా సేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టల్ ఉద్యోగులు చేసే ఆందోళనకు సీటీయూ సంపూర్ణ మద్దతు పలికింది. పెద్ద సంఖ్యలో ఉన్న ఖాళీల భర్తీకి, సేవల మెరుగుదల డిమాండ్లనూ సమర్థించింది. సామాన్యులు సైతం కార్మికులకు అండగా నిలవాలని కోరింది. వేర్వేరు రంగాల శ్రామికుల ఐక్య పోరాటాలకు ప్రజలు మద్దతివ్వాలని,; ప్రజా వ్యతిరేక, దేశ వినాశకర విధానాలను అనుసరిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీటీయూసీల ఐక్యవేదిక పిలుపునిచ్చింది.

పొలార్డ్ అరుదైన ఘనత

ట్రినిడాడ్: వెస్టిండీస్ మాజీ సారథి కీరన్ పొలార్డ్ అరుదైన ఘనతను అందుకున్నాడు. టీ20 క్రికెట్ లో మరెవరికీ సాధ్యం కాని రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. 600 టీ-20 మ్యాచ్‌లు ఆడిన తొలి క్రికెటర్‌గా అవతరించాడు. ప్రస్తుతం ది హండ్రెడ్ టోర్నమెంట్‌లో ఆడుతున్న ఈ ఆల్‌రౌండర్... సోమవారం ఈ ఘనత సాధించాడు. ఈ లీగ్‌లో లండన్ స్పిరిట్స్ తరపున ఆడుతున్న పొలార్డ్, ఈ ఘనతను తనదైన శైలిలో ఆస్వాదించాడు. సోమవారం జరిగిన మ్యాచ్‌లో మాంచెస్టర్ ఒరిజినల్స్‌పై 11 బంతుల్లోనే ఒక ఫోర్, 4 భారీ సిక్సర్లతో 34 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో తన జట్టు 52 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో పొలార్డ్ ఇప్పటివరకు 600 టీ-20 మ్యాచ్‌ల్లో 11,723 పరుగులు సాధించాడు. సగటు 31.34. అత్యధిక వ్యక్తిగత స్కోరు 104. ఒక సెంచరీ సహా 56 అర్ధసెంచరీలు అతడి ఖాతాలో ఉన్నాయి. బౌలింగ్‌లోనూ 309 వికెట్లు పడగొట్టడం విశేషం. అత్యుత్తమ బౌలింగ్ రికార్డు 15 పరుగులకు 4 వికెట్లు తీయడం. పొలార్డ్... వెస్టిండీస్ దేశీయ జట్టు ట్రినిడాడ్ అండ్ టొబాగో, ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్, బిగ్‌బాష్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్, మెల్‌బోర్న్ రెనెగేడ్స్, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో ఢాకా గ్లాడియేటర్స్, ఢాకా డైనమైట్స్, పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో కరాచీ కింగ్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. పొలార్డ్ తర్వాత వరుసగా విండీస్ మాజీ క్రికెటర్ డ్వేన్ బ్రావో(543), పాక్ ఆటగాడు షోయబ్ మాలిక్(472), క్రిస్ గేల్(463), రవి బొపారా(426) ఉన్నారు. వీరి వయసు దాదాపు 40కి చేరువలో ఉంది. మాలిక్ మినహా అంతా ఇప్పటికే జాతీయ జట్లకు రిటైర్మెంట్ ప్రకటించారు. వీరంతా మిగతా టోర్నీల్లో ఆడినా.. పొలార్డ్ కూడా ఆడుతున్నాడు కనుక ఇప్పట్లో పొలార్డ్ రికార్డును ఎవరూ అధిగమించే అవకాశాల్లేవు.

శీతాకాల సమావేశాలతోనే ముగింపు !

- పాతదైన పార్లమెంటు భవనం
- 101 ఏళ్ల చరిత్రకు సాక్షిగా నిలిచిన కట్టడం
- దేశ రాజధాని ఢిల్లీ ప్రయాణానికి ప్రతీక

న్యూఢిల్లీ : 1927లో ప్రారంభమైనప్పటి నుంచి కొత్త సంసద్ భవన్‌కు శంకుస్థాపన వరకు ఎన్నో పరిణామాలను చూసి దేశ చరిత్రకు గొప్ప సాక్షిగా నిలిచిన పార్లమెంటు భవనం కాలం చెల్లినదిగా మారిపోయింది. దీంతో వర్షాకాల సమావేశాలే ఇక్కడ జరిగిన చివరి పార్లమెంటు సమావేశం కావచ్చు. దాదాపు ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విశాలమైన భవనం మొదటి అంతస్తులో ఇసుకరాయితో చేసిన 144 స్తంభాలు అందంగా అమర్చి ఉన్నాయి. ప్రపంచంలోని విలక్షణమైన పార్లమెంటు భవనాలలో ఒకటిగా ఇది ఉంది. ఈ భవనానికి 101ఏళ్ల కిందట పునాది పడింది. నూతన పార్లమెంటు భవనానికి ప్రధాని మోదీ 2020లో శంకుస్థాపన చేశారు. శీతాకాల సమావేశాలకు ముందు ఈ భవన నిర్మాణం పూర్తి అవుతుందన్న అంచనా ఉంది. 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ఇది పూర్తవుతుందని తొలుత భావించారు. శీతాకాల సమావేశాలు కొత్త భవనం లో జరిగితేగనుక 95ఏళ్ల చరిత్రగల బ్రిటిష్ నాటి కట్టడానికి ముగింపు పలికినట్టే అవుతుంది. ఆ గొప్ప శకం ముగిసిపోతుంది. పార్లమెంటు భవనం కాలక్రమేణ పేర్లు మార్చుకుంది. పార్లమెంటు హౌస్ / సంసద్ భవన్‌గా దీనిని అధికారికంగా వ్యవహరిస్తారు.

1911లోని గ్రాండ్ దర్బార్ తర్వాత సామ్రాజ్య రాజధాని కలకత్తా నుంచి ఢిల్లీకి మారింది. ఆపై పురాతన పార్లమెంటు భవనం చరిత్ర.. దేశ రాజధాని ఢిల్లీ పయనానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఈ చరిత్రాత్మక భవనం ప్రారంభానికి దాదాపు నెల రోజుల ముందు 1926లో రాజధానికి న్యూఢిల్లీగా అప్పటి చక్రవర్తి కింగ్ జార్జ్ 5 పేరుపెట్టారు. 1921, ఫిబ్రవరిలో భారత్ నిర్మాణ దశలో.. స్వాతంత్ర్యానికి 26ఏళ్ల దూరంలో ఉన్నప్పుడు బ్రిటన్ డ్యూక్ ఆఫ్ కన్నాట్ ద్వారా పార్లమెంటు భవనానికి శంకుస్థాపన జరిగింది. ఈ కట్టడం భారత పునర్జన్మకు... ఉన్నత గమ్యస్థానాలకు గుర్తుగా ఉంటుందని ఆయన అప్పట్లో ఆకాంక్షించారు.

గతేదాది పార్లమెంటు భవనానికి వందేళ్ల సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభలో బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఈ భవనాన్ని సర్ హెర్బర్ట్ బేకర్ డిజైన్ చేశారు. రైసినా హిల్స్‌లో కొత్త రాజధాని ఢిల్లీ డిజైన్ చేసేందుకు సర్ ఎడ్విన్ ల్యూటెన్స్‌తో కలిసి ఆయన పనిచేశారు.

కౌన్సిల్ హౌస్‌గా పిలిచే కళాఖండాన్ని ఆరేళ్ల తర్వాత అంటే 1927లో (1948, ఆగస్టు 15నభారత్‌కు స్వాతంత్ర్యం రావడానికి 20ఏళ్ల ముందర) వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ప్రారంభించారు. భవనంలోని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ.. లోక్‌సభగా మారింది. కౌన్సిల్ ఆఫ్ స్టేట్.. రాజ్యసభ అయింది. చాంబర్ ఆఫ్ ప్రిన్సెస్‌ను వేర్వేరు అవసరాలకు వాడుతున్నారు. సెంట్రల్ హాల్.. గ్రంథాలయంగా మారింది. అక్కడ అనేక సంయుక్త సమావేశాలు నిర్వహిస్తారు.

దశాబ్దాలు గడిచాయి. భారత్ నేడున్న స్థితికి చేరుకుంది. ఎన్నో చరిత్రాత్మక పరిణామాలను పార్లమెంటు భవనం సాక్షిగా నిలిచింది. ఇప్పుడు ఈ కట్టడం పాతదైందని కొత్త పార్లమెంటు నిర్మాణం జోరుగా సాగుతోంది. శీతాకాల సమావేశాలను నూతన భవనంలో నిర్మిస్తేగనుక తాజా వర్షాకాల సమావేశాలతో ప్రస్తుత పార్లమెంటు భవనంలో కార్యకలాపాలకు శుభం కార్డు పడినట్లు అవుతుంది.

దిగ్గజ అంపైర్ రూడీ కోయెర్ట్‌జెన్ మృతి

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాకు చెందిన దిగ్గజ క్రికెట్ అంపైర్ రూడీ కోయెర్ట్‌జెన్ (73) మృతి చెందారు. మంగళవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో ఆయన చనిపోయినట్లు స్థానిక వెబ్‌సైట్ వెల్లడించింది. కోయెర్ట్‌జెన్ దాదాపు 400 అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు అంపైర్‌గా పనిచేశారు. 1990-2010 మధ్య కాలంలో గొప్ప అంపైర్‌గా పేరుగాంచారు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. తన తండ్రి మరణవార్తను రూడి కోయెర్ట్‌జెన్ జూనియర్ ధ్రువీకరించారు. వెబ్‌సైట్ కథనం ప్రకారం... రివర్స్‌డేల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోయెర్ట్‌జెన్ సహా మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కేప్‌టౌన్‌లో గోల్ఫ్ వీకెండ్ ముగించుకొని, ఇంటికి తిరుగు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కోయెర్ట్‌జెన్ మృతి పట్ల అనేకమంది ప్రస్తుత, మాజీ క్రికెటర్లు, అంపైర్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నారు. కోయెర్ట్‌జెన్ 2002లో ఐసీసీ ఎలైట్ ప్యానెల్‌లో చోటు సంపాదించారు. దాదాపు ఎనిమిదేళ్లు ఈ హోదాలో కొనసాగారు. తన కెరీర్‌లో 397 మ్యాచ్‌లకు ఆన్ ఫీల్డ్, టీవీ అంపైర్‌గా ఉన్నారు. ఇందులో 128 టెస్టులు, 250 వన్డేలు, 19 టీ-20లు ఉన్నాయి. ఆయన 2010లో అంపైరింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆస్ట్రేలియా-పాకిస్థాన్ మధ్య జరిగిన టెస్ట్‌లో చివరిసారి అంపైరింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ దిగ్గజ అంపైర్ కొన్ని వివాదాల్లోనూ చిక్కుకున్నారు. ఆస్ట్రేలియా, శ్రీలంక మధ్య జరిగిన 2007 వన్డే ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను వెలుతురు సరిగా లేకున్నా నిర్వహించారన్న ఆరోపణ ఉంది. ఐసీసీ నిబంధనను అతిక్రమించిన కారణంగా, అదే ఏడాది తన సొంత దేశంలో జరిగిన తొలి టీ-20 ప్రపంచ కప్‌లో కోయెర్ట్‌జెన్‌ను ఐసీసీ పక్కనబెట్టింది.

ఎంతో గొప్ప వ్యక్తి: సెహ్వాగ్

కోయెర్ట్‌జెన్ మరణవార్త గురించి తెలిసిన వెంటనే టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పందించాడు. దిగ్గజ అంపైర్‌కు నివాళులు అర్పించాడు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపాడు. ఆయనతో తనకు గొప్ప అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నాడు. తానెప్పుడైనా ర్యాష్ షాట్ ఆడినప్పుడు తనను కోప్పడేవారని, తెలివిగా ఆడాలని హెచ్చరించేవారని పేర్కొన్నాడు. తన బ్యాటింగును చూడాలని అనుకుంటున్నానని అన్నారని గుర్తు చేసుకున్నాడు. ఆయన చాలా మంచి, గొప్ప వ్యక్తని కొనియాడాడు.

నీరజ్ రికార్డును అధిగమించిన పాక్ అథ్లెట్ నదీమ్

బర్మింగ్‌హామ్: కామన్వెల్త్ క్రీడల్లో భాగంగా జావెలిన్ త్రోలో పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ రికార్డు సృష్టించాడు. ఫైనల్లో ఏకంగా జావెలిన్‌ను 90.18 మీటర్ల దూరం విసిరి పసిడి పతకం సాధించాడు. ఈ క్రమంలో జావెలిన్‌ను 90 మీటర్లకు పైగా విసిరిన రెండో ఆసియా అథ్లెట్‌గా గుర్తింపు పొందాడు. 2017లో చైనా అథ్లెట్ తైపీ 91.36 మీటర్ల త్రో ఇప్పటివరకు అత్యధికం. నదీమ్ ప్రదర్శనతో పాక్ 56 ఏళ్ల తర్వాత కామన్వెల్త్ గేమ్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పతకం గెలవగా... జావెలిన్ త్రోలో పాక్‌కు ఇదే తొలి స్వర్ణం. ఈ ప్రదర్శనతో నదీమ్... టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు స్వర్ణ పతకం అందించిన భారత అథ్లెట్, ప్రపంచ నంబర్‌వన్ నీరజ్ చోప్రా విసిరిన త్రో(87.58 మీటర్లు)ను అధిగమిం చాడు. నీరజ్ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో విసిరిన త్రో (88.13 మీటర్లు)ను కూడా దాటేశాడు. ఇటీవల ముగిసిన ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నదీమ్ ఐదో స్థానంలో నిలువగా.. నీరజ్ చోప్రా 88.13 మీటర్ల దూరం విసిరి రజత పతకాన్ని గెలుచుకున్నాడు. అయితే, నీరజ్ చోప్రా కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనుంటే కచ్చితంగా 90 మీటర్ల దూరం విసిరేవాడని అంతా భావించారు. కానీ గాయం కారణంగా దూరమయ్యాడు. కామన్వెల్త్ గేమ్స్ జావెలిన్ త్రో గోల్డ్ కొట్టిన అర్షద్... ఈ విషయాన్ని ఇన్‌స్టాలో పోస్ట్ చేయగా, భారత స్టార్ ఆటగాడు నీరజ్ చోప్రా స్పందించాడు. 'అర్షద్ భాయ్ స్వర్ణం సాధించినందుకు అభినందనలు. 90 మీటర్ల త్రో దాటి కొత్త రికార్డు నమోదుచేశావు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో గెలవాలి. ఆల్ ది బెస్ట్' అని అభినందించాడు.

ఇక మోదీ వర్సెస్ నితీశ్

- 2024లో ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థి?
- ఆయన యూ-టర్న్‌ల పైనే అనుమానం
- బీజేపీకి గుడ్‌బైతో మారుతున్న రాజకీయ సమీకరణలు

న్యూఢిల్లీ: బీజేపీతో తెగతెంపులు చేసుకోవడంతో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 2024 సార్వత్రిక ఎన్నికలకు ప్రధాని అభ్యర్థిగా మరోసారి ప్రచారంలోకి వచ్చారు. అయితే కొంతమంది విపక్ష నేతలు జేడీ(యూ) నాయకుడి 'యూ-టర్న్'ను ఉదహరిస్తూ, అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీతో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సహా ప్రధానమంత్రి కావాలన్న ఆశతో ఉన్న అనేకమంది నాయకులలో నితీశ్‌కుమార్ ఒకరని ప్రతిపక్ష సీనియర్ నాయకుడు ఒకరు ఎత్తి చూపారు. 'నాయకుల వ్యక్తిత్వాలను బేరీజు వేసుకుంటే నితీశ్‌కుమార్‌కు ప్రధాని అయ్యే అర్హత ఉంది. ఆయనలో ప్రధానికి కావల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయి' అని జనతాదళ్(యూ) పార్లమెంటరీ బోర్డు అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా పాట్నాలో అన్నారు. నితీశ్ 2024 లోక్‌సభ ఎన్నికలకు ప్రధాని అభ్యర్థి కావచ్చని ఆర్‌జేడీ నాయకుడు శరద్ యాదవ్ తెలిపారు. అయితే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత రాజ్‌భవన్ నుంచి బయటికి వచ్చినపుడు ప్రధానమంత్రి పదవికి సంబంధించిన విలేకరుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి నితీశ్ నిరాకరించారు. 2017లో ఆర్‌జేడీ-జేడీ(యూ)-కాంగ్రెస్ మహాకూటమి నుంచి వైదొలిగి బీజేపీతో చేతులు కలిపిన తర్వాత యూ-టర్న్ తీసుకున్న నితీశ్‌ను ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ 'పల్టు రామ్' గా అభివర్ణించిన విషయం విదితమే. 2019 అక్టోబర్‌లో నితీశ్‌ను ఊసరవెల్లిగా తేజస్వీ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన లౌకిక కూటమికి తిరిగి వచ్చే అవకాశం లేదని తెలిపారు. 2005లో లాలూ ప్రసాద్ పాలనపై పోరాటం చేసి నితీశ్ తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోదీని ప్రకటించడంతో నితీశ్ 2013లో బీజేపీ చెలిమి వీడారు. ఆ తర్వాత ఆర్‌జేడీ, కాంగ్రెస్‌తో కలిసి మహాకూటమిని ఏర్పరచుకుని 2015లో తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. ఆర్‌జేడీ అవినీతిని ఎత్తిచూపుతూ 2017లో మహాకూటమి నుంచి వైదొలిగారు. అవినీతి విషయానికొస్తే నితీశ్ కుమార్ రాజకీయ జీవితం మచ్చలేనిదని, అయితే రాజకీయ మిత్రులను ఎన్నిసార్లు మార్చుకున్నారనేది అందరికీ తెలిసిందేనని శివసేన నేత ప్రియాంక చతుర్వేది అన్నారు. 'నితీశ్ కుమార్ తరచుగా మనసు మార్చుకునే మిత్రుడు. ఇది అతనికి వ్యతిరేకంగా సాగే ఒక విశ్వసనీయ అంశం' అని రాజ్యసభ ఎంపీ చతుర్వేది తెలిపారు. ఉద్ధవ్ ఠాక్రే కూడా ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి సమయంలో బీజేపీకి వ్యతిరేకంగా గట్టిగా నిలబడ్డారని, స్వచ్ఛమైన పాలన అందించిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. 'సమర్థులైన ప్రతిపక్ష నాయకులున్నారు. 2024లో పరిస్థితులు ఎలా రూపుదిద్దుకుంటాయో చూడాలి' అని చతుర్వేది అన్నారు. కాగా, వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్ నాయకులు బీహార్ పరిణామాలను స్వాగతించారు. నితీశ్ కుమార్‌కు ప్రధానమంత్రి అవకాశాలపై వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. శరద్‌పవార్, మమతా బెనర్జీ సహా 2024లో ప్రధానమంత్రి పదవికి సవాలు విసిరే వ్యక్తుల్లో నితీశ్ కూడా ఒకరని ఎన్‌సీపీ నాయకుడు మజీద్ మెమన్ అన్నారు. ఎన్‌సీపీ అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో మాట్లాడుతూ బీజేపీని పారదోలేందుకు నితీశ్ చర్య భవిష్యత్ రాజకీయ పునరేకీకరణకు నాంది కావచ్చని అన్నారు. ఏడు జన్మలెత్తినా నితీశ్ ప్రధాని కాలేరని జేడీ(యూ) మాజీ నేత ఆర్‌సీపీ సింగ్ అన్నారు. '2024లో మమతా బెనర్జీతో పోలిస్తే నితీశ్ కుమార్ ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థికి ఆమోదయోగ్యమైన ముఖంగా ఉంటారని కాంగ్రెస్ నాయకుడు సంజయ్ ఝా అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.